


మునగపాక మండలం గణపర్తి ఆర్‌ఎస్‌కేలో రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

చంద్రగ్రహణంతో ఆలయాలు మూసివేత

నేటి ఉదయం సంప్రోక్షణ తరువాత భక్తులకు ప్రవేశం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం కారణంగా స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయంతోపాటు పట్టణంలోని పలు ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం తరువాత మూసివేశారు. ఆలయాల అధికారుల సమక్షంలో అర్చకులు ఆయా దేవాలయాల తలుపులకు తాళాలు వేశారు. దేమునిగుమ్మంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సాయంత్రం 5.45 గంటలకు అర్చకులు మూసివేశారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ చేసిన తరువాత తొమ్మిది గంటల నుంచి భక్తులకు ఆలయ దర్శనాలు ప్రారంభం అవుతాయని అర్చకులు వెల్లడించారు.


నూకాంబిక ఆలయాన్ని మూసివేసి తాళం వేస్తున్న అర్చకుడు

ఉపమాకలో..

నక్కపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక వేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని ఆదివారం మధ్యాహ్నం 1.50 గంటలకు మూసివేశారు. చంద్రగ్రహ ణం నేపథ్యంలో టీటీడీ ఆగమ సలహాదారుల సూచనల మేరకు ఆలయ ప్రధాన గోపురం, గర్భగుడి, కొండపై వున్న మూలవిరాట్ సన్నిధి తలుపులను మూసివేసి తాళాలు వేశారు. సోమవారం ఉదయం 5.30 గంటలకు ఆలయాన్ని తెరచి సంప్రోక్షణ అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతిస్తామని ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు చెప్పారు.


ఉపమాక ఆలయ తలుపులు మూసివేస్తున్న అర్చకులు, అధికారులు

ఎలమంచిలిలో భారీ ఎత్తున వినాయక నిమజ్జనం

ఎలమంచిలి పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించి, వినాయక విగ్రహాన్ని ట్రాలీపైకి ఎక్కించారు. అనంతరం పలు వీధుల్లో ఊరేగిస్తూ రాంబిల్లి మండలం నారాయణపురం వద్ద మైనర్ శారదా నదిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.
-ఎలమంచిలి /ఆంధ్రజ్యోతి


నిమజ్జనానికి వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళుతున్న దృశ్యం

యూరియా కొరత లేదు

నిరంతరాయంగా ఎరువుల సరఫరా

- ప్రస్తుతం 1,500 టన్నుల యూరియా నిల్వలు
- ఈ వారంలో మరికొంత సరఫరా
- రైతులందరికీ అందేలా చర్యలు
- జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్


వెదురుపర్తి ఆర్‌ఎస్‌కే వద్ద రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

కశింకోట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని యూరియా సరఫరా నిరంతరంగా కొనసాగుతున్నదని, ఎవరూ ఆందోళన చెందనవసరం లేదని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. ఆదివారం ఆమె మండలంలోని వెదురుపర్తి గ్రామ రైతు సేవా కేంద్రంలో ఎరువుల పంపిణీ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఎరువుల సరఫరా పరంగా ఎలాంటి సమస్యలు ఉన్నా చెప్పాలని కోరారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రస్తుతం 1,500 టన్నుల యూరియా అందుబాటులో వుందని, ఇందులో 1,050 టన్నులు రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లలో, 450 టన్నులు ప్రైవేటు దుకాణాల్లో ఉన్నట్టు తెలిపారు. యూరియా సరఫరా, పంపిణీపై ప్రతి మండలంలో తహశీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయాధికారులతో మూడు బృందాలను ఏర్పాటు చేశామని, ఆదివారం సెలవు అయినప్పటికీ అధికారులు తమ పరిధిలోని గ్రామాల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి, ఎరువుల సరఫరా గురించి తెలియపరుస్తున్నారని, ఇదే సమయంలో రైతుల సందేహాలను, అనుమానాలను నివృత్తి చేస్తున్నారని చెప్పారు. రైతులు తప్పనిసరిగా బయోమెట్రిక్ ద్వారా యూరియా కొనుగోలు చేయాలని సూచించారు. యూరియాను మోతాదుకు మించి వినియోగిస్తే వరిపైరుకు చీడపీడల ఉధృతి పెరిగే ప్రమాదం వుందన్నారు. రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లో ఎటువంటి జాప్యం లేకుండా రైతులు ఎరువులు పొందవచ్చని ఆమె చెప్పారు. ఈ వారంలోనే జిల్లాకు మరికొంత యూరియా సరఫరా అవుతుందని, అందువల్ల వచ్చే నెలకు అవసరమైన యూరియాను రైతులు ఇప్పుడే కొనుగోలు చేయవద్దని కోరారు. వ్యాపారులు ఎవరైనా అధిక ధరకు యూరియా అమ్మితే సమీపంలో ఉన్న మండల వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేయాలని, సంబంధిత వ్యాపారులపై చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట అనకాపల్లి ఆర్డీవో ఆయిషా, మండల ప్రత్యేకాధికారి వి.లక్ష్మీసుభాషిణి, జిల్లా ... మిగతా 6వ పేజీలో

ఎరువులపై వైసీపీ దుష్ప్రచారం

కొరత లేనప్పటికీ రైతులను పక్కదారి పట్టిస్తున్నారు

- ప్రతిపక్ష నేతలపై కూటమి ఎమ్మెల్యేల ఆగ్రహం

మునగపాక/ ఎలమంచిలి/ బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎరువుల సరఫరాపై వైసీపీ సోషల్ మీడియా, ఆ పార్టీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని కూటమి ఎమ్మెల్యేలు మండిపడ్డారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఆదివారం ఉదయం మునగపాక మండలం గణపర్తిలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, షెడ్యూల్ ప్రకారం ఇంత వరకు 95 శాతం మేర యూరియా పంపిణీ జరిగిందని, ఈ విషయం వైసీపీ నాయకులకు తెలిసినప్పటికీ ఉద్దేశపూర్వకంగానే రైతులను పక్కదారి పట్టించి, ప్రభుత్వంపై బురద చల్లడానికి దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సబ్బవరం మండలం పైడివాడఅగ్రహారంలో ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, కొంత మంది ఎరువుల వ్యాపారులు సృష్టించిన కృత్రిమ కొరతను సాకుగా చూపించి కూటమి ప్రభుత్వంపై అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

రైతులకు అందుబాటులో యూరియా

అవసరాన్నిబట్టి వెంటనే రప్పిస్తున్నాం

- నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ
- రోలుగుంట పీఏసీఎస్‌లో తనిఖీలు

రోలుగుంట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో యూరియా ఎరువు అందుబాటులో వుందని, రైతుల అవసరాలనుబట్టి ఎప్పటికప్పుడు యూరియాను రప్పిస్తున్నామని నర్సీపట్నం ఆర్డీఓ వీవీ రమణ చెప్పారు. ఆదివారం ఉదయం ఆయన ఇక్కడ పీఏసీఎస్‌ను సందర్శించి యూరియా నిల్వలను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఇప్పటి వరకు రైతులకు సరఫరా చేసిన యూరియా వివరాలను పరిశీలించారు. యూరియా పక్కదారి పట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అర్హులైన రైతులందరికీ యూరియా అందించే బాధ్యత వ్యవసాయ శాఖ అధికారులపై ఉందన్నారు. అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, యూరియా గురించి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగమ్మ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


రోలుగుంట పీఏసీఎస్‌లో ఎరువుల రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ వీవీ రమణ

పలుచోట్ల భారీ వర్షం

నీటమునిగిన రహదారులు, లోతట్టు ప్రాంతాలు

- అనకాపల్లిలో ఆర్టీసీ కాంప్లెక్స్ జలమయం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం తరువాత భారీ వర్షం కురిసింది. ఉదయం మధ్యాహ్నం వరకు ఎండ వేడితోపాటు గాలి వీచకపోవడంతో ఉక్కపోతతో జనం ఇబ్బంది పడ్డారు. తరువాత వాతావరణం మారిపోయి ఆకాశం మేఘావృతమైంది. ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. రహదారులన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ చెరువులను తలపించింది. విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద వర్షపునీరు నిలిచిపోవడంతో చోడవరం మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బంది పడ్డారు.సాయంత్రం ఆరు గంటల తరువాత కూడా ముసురు వాతావరణం కొనసాగింది.


వర్షం నీరు నిలిచిపోయి చెరువును తలపిస్తున్న అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్

కోటవురట్లలో..

కోటవురట్ల, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉదయం నుంచి ఆకాశం మబ్బుగా వుండి, మధ్యాహ్నం తరువాత చిరుజల్లులుగా ప్రారంభమై మూడు గంటల తరువాత భారీవర్షం కురిసింది. డ్రైనేజీ కాలువలు పొంగి రహదారులపై వర్షం నీరు ప్రవహించింది. ఇటీవల వరినాట్లు వేసిన పొలాలకు నీరు పెట్టాల్సిన అవసరం లేకుండా సరిపడ వర్షం కురిసింది. ఇంకా పత్తి, మొక్కజొన్న, కూరగాయలు, చెరకు పంటలకు ఈ వర్షం ఉపయోగపడుతుం దని రైతులు చెబుతున్నారు.


కోటవురట్ల కురుస్తున్న వర్షం

మాకవరపాలెంలో..

మాకవరపాలెం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం తరువాత భారీ వర్షం కురిసింది. అంతకు ముందు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ చిటపటలాడింది. తరువాత వాతావరణం మారిపోయి వర్షం కురిసింది. వాతావరణం చల్లబడడంతో జనం ఉపశమనం చెందారు.

పరవాడలో మోస్తరు వర్షం

పరవాడ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం సుమారు అర్ధ గంటపాటు మోస్తరు వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. మట్టి, మెటల్ రహదారులు చిత్తడిగా మారాయి.

రిమాండ్ ఖైదీల అరెస్టు

ఐదో తేదీన చోడవరం సబ్‌జైలు నుంచి ఇద్దరు పరారీ

అనకాపల్లి రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చోడవరం సబ్‌జైలు వార్డర్‌ను సుత్తితో కొట్టి పరారైన రిమాండ్ ఖైదీలను అరెస్టు చేసినట్టు ఎస్పీ తుహిన్‌సిన్హా పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించి ఆయన వెల్లడించిన వివరాలిలా వున్నాయి.

- హెడ్‌వార్డర్‌పై సుత్తితో దాడి
- అప్రమత్తమైన పోలీసు శాఖ.. ప్రత్యేక బృందాలు ఏర్పాటు
- ఆరో తేదీ సాయంత్రం విశాఖలో పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు
- చోడవరం పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన ఎస్పీ తుహిన్‌సిన్హా


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా. వెనుక నల్ల ముసుగులో వున్న రిమాండ్ ఖైదీలు

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం టోకూరు పంచాయతీ కార్యదర్శి నక్కా రవికుమార్ ప్రభుత్వ సామాజిక పింఛన్ల సొమ్మును మాయం చేసిన కేసులో ఏప్రిల్ 25న అనంతగిరి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మాడుగులకు చెందిన బెజవాడ రాము పలుచోట్ల చోరీలకు జూలై 23న పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి వీరు చోడవరం సబ్‌జైలులో రిమాండ్ ఖైదీలుగా వుంటున్నారు. ఈ నేపథ్యంలో ఐదో తేదీన సాయంత్రం ఐదు గంటలకు జైలు హెడ్‌వార్డర్ వాన వీర్రాజుపై ఇనుప సుత్తితో దాడి చేసి గాయపరిచారు. గేటు తాళం చెవులను లాక్కొని సబ్‌జైలు నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు అప్రమత్తం అయ్యారు. పరారైన రిమాండ్ ఖైదీలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను నియమించడంతోపాటు వారి ఫొటోలను వివిధ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. దీంతో విశాఖ సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం సాయంత్రం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జిల్లా కోర్టుకు వెళ్లే దారిలో రిమాండ్ ఖైదీలను పట్టుకున్నారు. అనంతరం చోడవరం పోలీసులకు సమాచారం అందించారు. చోడవరం సీఐ పి.అప్పలరాజు, సిబ్బందితో విశాఖపట్నం వెళ్లి, నిందితులను అదుపులోకి తీసుకొని చోడవరం తీసుకువచ్చారు. సబ్ జైలు హెడ్ వార్డర్‌ను కొట్టి, పారిపోవడానికిగల కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు. ఇదే జైలులో రిమాండ్ ఖైదీగా వున్న ఏకస్వామితో నక్కా రవికుమార్, బెజవాడ రాములకు పరిచయం ఏర్పడింది. వీరిద్దరికి బెయిల్ మంజూరైనప్పటికీ జామీను ... మిగతా 6వ పేజీలో

రైవాడకు కొనసాగుతున్న వరద

స్పిల్‌వే నుంచి 600 క్యూసెక్కులు విడుదల

- ఆయకట్టుకు, జీవీఎంసీకి 200 క్యూసెక్కులు సరఫరా

దేవరాపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైవాడ జలాశయంలోకి వరద ప్రవాహనం ఆదివారం కూడా కొనసాగింది. గరిష్ఠ నీటి మట్టం 114 మీటర్లు కాగా, జలాశయంలోకి 600 క్యూసెక్కుల వరద నీరు చేరుతుండడంతో పూర్తిస్థాయికి చేరింది. దీంతో స్పిల్‌వే గేటు నుంచి 600 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. ఆయకట్టుకు 150 క్యూసెక్కులు, జీవీఎంసీ తాగునీటి అవసరాలకు 50 క్యూసెక్కుల నీటిని కాలువల ద్వారా సరఫరా చేస్తున్నారు.


రైవాడ స్పిల్‌వే వద్ద గరిష్ఠ స్థాయిలో వున్న నీటి మట్టం

పెద్దేరు నుంచి 350 క్యూసెక్కులు..

మాడుగుల రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దేరు జలాశయానికి ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ఇటీవల కురిసిన వర్షాలతో జలాశయంలోకి వరద నీరు భారీగా చేరడంతో నీటిమట్టం గరిష్ఠస్థాయికి చేరింది. పూర్తిస్థాయి నీటిమట్టం 137 మీటరు కాగా ఆదివారం సాయంత్రానికి 435 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 136.55 మీటర్లకు చేరింది. ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలోజలాశయం మూడో గేటు తెరిచి 350 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నట్టు జలాశయం ఏఈ సుధాకరరెడ్డి తెలిపారు.

ప్రాణాలు తీసిన చేపల వేట సరదా

మేహాద్రిగెడ్డలో మునిగి ఇద్దరు యువకుల మృతి


బల్లంకి శేఖర్ (ఫైల్)


లక్ష్మణ్ కుమార్(ఫైల్)

గోపాలపట్నం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చేపల వేట సరదా రెండు నిండు ప్రాణాలు బలిగొంది. మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ వద్ద వేటకు వెళ్లిన ఇద్దరు యువకులు నీటిలో మునిగి మృతిచెందారు. ఘటనకు సంబంధించి ... మిగతా 6వ పేజీలో

కూటమి హయాంలో రజకులు అన్ని రంగాల్లో అభివృద్ధి

'రజకుల ఆకాంక్ష సభ-2'లో రాష్ట్ర మంత్రులు పార్థసారథి, సత్యకుమార్, కొల్లు రవీంద్ర

విశాఖపట్నం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో రజకులు సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధి సాధించేందుకు పూర్తి అవకాశాలు కల్పిస్తున్నామనిరాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, సత్యకుమార్ యాదవ్, కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఆదివారం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు అధ్యక్షతన ఉమ్మడి విశాఖ జిల్లా 'రజకుల ఆకాంక్ష సభ-2' పేరుతో ప్రభుత్వ పథకాల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, రజకుల జీవన పరిస్థితులు ఇంకా వెనుకబాటుగా ఉండటం బాధకరమన్నారు. హోటళ్లు, టూరిస్ట్ రిసార్టులలో దోబీ పనిని హక్కుగా కల్పించేలా ప్రత్యేక చట్టం రావాల్సి ఉందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో దోబీల నియామకానికి చర్యలు తీసుకుంటామన్నారు. రజకులకు నైపుణ్య శిక్షణలు అందించి స్వయం ఉపాధి దిశగా సహకారం అందిస్తామన్నారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, కులవృత్తులను గౌరవిస్తూనే ... మిగతా 6వ పేజీలో


వేదికపై మంత్రులు పార్థసారథి, సత్యకుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్యేలు పంచకర్ల, ఎన్.ఈశ్వరరావు, పి.విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీ చిరంజీవిరావు తదితరులు

యూరియా పంపిణీపై వైసీపీది దుష్ప్రచారం

» ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా పంపిణీపై వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మండలంలోని గణపర్తి గ్రామంలో ఆదివారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు రాష్ట్రంలో 95 శాతంకు పైగా యూరియా పంపిణీ చేసినట్టు చెప్పారు. అయినా, వైసీపీ కావాలనే రైతులను, ప్రజలను తప్పుదోవపట్టించడం కోసం లేనిపోని ఆరోపణలు చేస్తోందన్నారు. ఎన్టీఆర్ పింఛన్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఉచిత గ్యాస్, ఉచిత బస్సు వంటి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తుంటే ఇవేవీ అందలేదంటూ వైసీపీ విష ప్రచారం చేస్తోందని తెలిపారు. మండల వ్యవసాయాధికారి సీహెచ్.జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ, పశు గ్రాసానికి నానో యూరియా అందుబాటులో ఉందని, ఖర్చు కూడా తక్కువేనని చెప్పారు. మండలంలో తోటాడ, వెంకటాపురం తదితర గ్రామాల్లో తహశీల్దార్ పి.సత్యనారాయణ రైతులుతో సమావేశమయ్యారు.యూరియాపై ఎటు వంటి ఆందోళన చెందవద్దని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు సుందరపు నీలకంఠస్వామి, చదరంనాయుడు, కూటమి నాయకులు కాండ్రేగుల శంకర్, ఎం.వి.రమణ, కాండ్రేగుల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ జిల్లా కార్యదర్శిగా రాజేశ్

నక్కపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ అనకాపల్లి జిల్లా సెక్రటరీగా నక్కపల్లి మండలం ఎస్.నర్సాపురానికి చెందిన ఎం.రాజేశ్ నియమితులయ్యారు. ఆదివారం చోడవరంలో జరిగిన సంఘ 13వ మహాసభలో రాజేశ్‌ను ఈ మేరకు ఎన్నుకున్నారు. ఈ మేరకు రాజేశ్‌ను ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి, బి.సుబ్బలక్ష్మి తదితరులు అభినందించారు.

యూరియా కొరత లేదు

... 5వ పేజీ తరువాయి

వ్యవసాయాధికారి మోహన్‌రావు, మండల వ్యవసాయాధికారి స్వప్న, ఎస్ఐ మనోజ్‌కుమార్ తదితరులు వున్నారు.

రైతులతో గ్రామసభలు



అనకాపల్లి మండలం కూండ్రంలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో

ఎరువుల సరఫరా, పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ, మండల పరిషత్, వ్యవసాయ శాఖ అధికారులు ఆదివారం జిల్లాలోని పలు గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించారు. అనకాపల్లి ఆర్డీవో ఆయిషా అనకాపల్లి మండలం కూండ్రం ఆర్ఎస్‌కేలో రైతులతో నిర్వహించిన సభలో మాట్లాడుతూ, జిల్లాలో యూరియా కొరత లేదని, వరి, చెరకే కాకుండా ఇతర పంటలకు సరిపడ ఉందన్నారు. నర్సీపట్నం డీఎల్‌డీవో నాగలక్ష్మి చీడికాడ, మాడుగుల మండలాల్లో స్థానిక అధికారులతో కలిసి పలు గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఎరువుల కోసం ఇబ్బందులు పడనవసరం లేదని, రైతులకు అవసరమైన మేర ఎరువులు సరఫరా చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా వుందన్నారు. సబ్బవరం తహసీల్దార్ చిన్నికృష్ణ, ఎంపీడీవో పద్మజ, ఏవో పోతల సత్యనారాయణ, తదితర అధికారులు అన్ని సచివాలయాల పరిధిలోని రైతులతో సమావేశాలు నిర్వహించారు. మండలంలో ఎరువులు కొరత లేదని, దీనిపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. దేవరాపల్లి మండలంలో తహశీల్దార్ లక్ష్మీదేవి, ఎంపీడీఓ సువర్ణరాజు, ఎస్ఐ సత్యన్నారాయణ, వ్యవసాయ అధికారి ఎల్.వై.కాంతమ్మ వేర్వేరు బృందాలుగా ఏర్పడి మండలంలోని అన్ని పంచాయతీల్లో ఆదివారం గ్రామసభలు నిర్వహించారు. యూరియా కొరత ఉందంటూ చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని రైతులకు సూచించారు. గొలుగొండ తహశీల్దార్ శ్రీనివాసరావు, ఏవో సుధారాణి, ఎస్ఐ రామారావు, ఇన్‌చార్జి ఎంపీడీవో బాబూరావు, తదితరులు మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఆదివారం రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఖరీఫ్ అవరాలకు సరిపడ యూరియాను ఆర్ఎస్‌కేలు, పీఏసీఎస్‌లతోపాటు ప్రైవేటు డీలర్ల వద్ద అందుబాటులో వుంచామన్నారు. ఎలమంచిలి మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో ఈ నెల 10, 11 తేదీల్లో ఎరువులు అందుబాటులో ఉంటాయని తహశీల్దారు కె.వరహాలు ఆదివారం కొక్కిరాపల్లిలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వెల్లడించారు. మాడుగుల ఎంపీడీవో కొంకి అప్పారావు, తహశీల్దారు రమాదేవి, ఎస్ఐ నారాయణరావులు మూడు బృందాలుగా ఏర్పడి, ఒక్కో బృందం పది పంచాయతీల్లో రైతులతో సభలు నిర్వహించారు. ఆర్ఎస్‌కేలు, సహకార సంఘాల్లో యూరియా అందుబాటులో వుందని చెప్పారు.

పాయకరావుపేట మండలంలో తహశీల్దారు మహేశ్వరరావు, ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు, ఏవో ఆదినారాయణ అన్ని గ్రామ పంచాయతీల్లో యూరియాపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు.

ఎస్.రాయవరం మండలంలోని పలు గ్రామాల్లో తహసీల్దారు జె.రమేశ్‌బాబు, ఎంపీడీవో సత్యనారాయణ, మండల వ్యవసాయాధికారిణి సౌజన్య విడివిడిగా సమావేశాలు నిర్వహించి, యూరియా పంపిణీపై అవగాహన కల్పించారు.

ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలోని ఎరువుల దుకాణాల్లో ఎస్ఐ వై.తారకేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, వీఆర్‌వో రాజు తనిఖీ చేశారు. ఇంతవరకు ఎంత మంది రైతులకు, ఎంత మొత్తం ఎరువులు విక్రయించారు, ప్రస్తుతం దుకాణాల్లో వున్న ఎరువుల స్టాకు గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే తమకు ఫిర్యాదు చేయాలని రైతులకు తెలిపారు.

ప్రాణం తీసిన వేట సరదా

... 5వ పేజీ తరువాయి

పెందుర్తి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి సమీపంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ (అయ్యప్పకాలనీ)కి చెందిన బల్లంకి శేఖర్ (18), బల్లంకి వాసుతోపాటు చినముషిడివాడ సమీపంలోని ఆక్సిజన్ కాలనీకి చెందిన యేడాడ లక్ష్మణ్ కుమార్ (18) డాక్‌యార్డ్‌లో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరు ఆదివారం ఉదయం 11.30 గంటల సమయంలో చేపలను వేటాడేందుకు మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌కు వెళ్లారు. రాతి రివిట్‌మెంట్‌పై కూర్చుని, నీటిలోకి గేలాలు వేశారు. ఈ క్రమంలో లక్ష్మణ్‌కుమార్ నీటిలో పడిపోయాడు. అతడిని రక్షించేందుకు దూకిన శేఖర్ కూడా మునిగిపోయాడు. అక్కడే వున్న బల్లంకి వాసు భయాందోళన చెంది, సమీపంలో వున్న రిజర్వాయర్ సిబ్బంది వద్దకు వెళ్లి, జరిగిన సంఘటన గురించి చెప్పాడు. వారు వెంటనే పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్, సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సాయంతో రిజర్వాయర్‌లో గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం మూడు గంటల సమయానికి యువకుల మృతదేహాలు లభించాయి.

రిమాండ్ ఖైదీల అరెస్టు

... 5వ పేజీ తరువాయి

లభించలేదు. దీంతో మీకు పది సంవత్సరాల శిక్ష తప్పదని, దీనిని నుంచి తప్పించుకోవాలంటే జైలు నుంచి పారిపోవాలని ఏకస్వామి చెప్పాడు. దీంతో పథకం ప్రకారం శుక్రవారం సాయంత్రం హెడ్ వార్డర్ వీర్రాజుపై సుత్తితో దాడి చేసి గాయపరిచారు. ఇతర సిబ్బందిని గార్డు గదిలో బంధించి, జైలు ఏఎస్ఐ కృష్ణమూర్తి మొబైల్ ఫోన్‌ను దొంగలించి, గేటు తాళాలను లాక్కొని పరారయ్యారు. రిమాండ్ ఖైదీలు జైలు నుంచి పరారు కావడానికి ఏకస్వామిపై మరో కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు. పరారైన రిమాండ్ ఖైదీలను 24 గంటల్లోనే పట్టుకున్న సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, అనకాపల్లి జిల్లా పోలీసులను ఎస్పీ తుహిన్ సిన్హా ఈ సందర్భంగా అభినందించారు. మీడియా సమావేశంలో అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి, సబ్‌జైలు ఇన్‌చార్జి ఆఫీసర్ డి.రాజు పాల్గొన్నారు.

అధ్వాన రహదారులతో అవస్థలు

» గత ఐదేళ్లుగా నిర్లక్ష్యం..

» కూటమి పాలనలో వేములపూడి, ఎల్‌వీకే రోడ్లకు నిధులు మంజూరు

» టెండర్లు పూర్తి.. త్వరలో నిర్మాణ పనులు

కోటవురట్ల, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): మండలం రహదారులు అధ్వాన స్థితికి చేరాయి.. గత ఐదేళ్లకాలంలో రోడ్లను అభివృద్ధిపై పట్టించుకోలేదు. దీంతో మండలంలో యండపల్లినుంచి వేములపూడి, ఎల్‌వికే రోడ్డు నుంచి నీలిగుంట గ్రామాల్లో రోడ్లు మరీ దారుణ స్థితికి చేరడంతో జనాలు రాకపోకలకు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. యండపల్లినుంచి నర్సీపట్నం మండలం వేములపూడి గ్రామానికి వెళ్ళే రహదారిలో 5 కిలోమీటర్ల మేర గత పదేళ్లనుంచి ఎటువంటి మరమ్మతులు నోచుకోలేదు.దీంతో అడుగడుగునా గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడున్నారు. గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు. ఆటోలు, ఇతర భారీ వాహనాలు నడిపేందుకు నానాయాతన పడుతున్నారు. ఎల్‌వీకే రోడ్డునుంచి నీలిగుంట రోడ్లు గంతుల మాయంగామారింది. ఈ మార్గంలో ప్రమాదకరంగా మారడంతో మారింది. ఈ రోడ్డులో అధిక గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఎక్కువ



రాళ్లుతేలిన నీలిగుంట రహదారి

మంది ద్విచక్రవాహనాలు,ఆటోలపైఆధారపడుతున్నారు. ఈ స్థితిలో కూటమి ప్రభుత్వంలో హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రి రహదారుల అభివృద్ధిపై దృష్టిసారించారు. ఈ రెండు రహదారులకు రూ2.80 కోట్లు మంజూరు చేశారు. యండపల్లి నుంచి అన్నవరం మీదుగా 5కిలోమీటర్లు రోడ్డు నిర్మాణానికి రూ.145 లక్షలు ప్రభుత్వం నాబార్డు నిధులు మంజూ



యండపల్లినుంచి వేములపూడి రోడ్డు దుస్థితి

రుచేసింది. ఏమాత్రం ఆదమరిస్తే గుంతల్లో బోల్తాపడి ఎన్నోప్రమాద ఘటనలు జరుగుతున్నాయి. ఎల్‌వీకే రోడ్డునుంచి నీలిగుంట రోడ్డు మరమ్మతులకు రూ.135లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఈ రెండు పనులు టెండర్లు ప్రక్రియపూర్తయ్యాయని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్టు ప్రాజెక్టు డీఈఈ రాజ్ కుమార్ తెలిపారు.

బై.. బై.. గణేశా..!

» ఘనంగా వినాయక నిమజ్జనాలు

ఎలమంచిలి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన 15 అడుగుల భారీ వినాయకుడి నిమజ్జన కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం అట్టహాసంగా నిర్వహించారు. మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం విగ్రహాన్ని స్టేషన్ రోడ్డు నుంచి ప్రధాన రోడ్డు మీదుగా స్వామి ఊరేగించారు. ఈ సందర్భంగా నేల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం నిమజ్జనం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: పూడిమడక తీరంలో శనివారం రాత్రి నుంచి అధిక సంఖ్యలో వినాయక నిమజ్జనాలు జరిగాయి. కేవలం పూడిమడకలోనే సుమారు పాతిక విగ్రహాల పందిళ్లు ఏర్పాటు చేశారు. వీరంతా గతంలో 15 నుంచి 21 రోజుల వరకు ఉత్సవాలు నిర్వహించారు. అయితే ఆదివారం రాత్రికి చంద్ర గ్రహణం ఉండటంతో శనివారం రాత్రి నుంచి విగ్రహ నిమజ్జనాలు చేపట్టారు. పూడిమడకతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భారీ స్థాయిలో వాహనాలపై వినాయక విగ్రహాలను తెచ్చి పూడిమడక సముద్రంలో కలిపారు. ఆదివారం సాయంత్రం వరకు కూడా నిమజ్జనాలు జరుగుతూనే ఉన్నాయి. డీజే సౌండ్లు, యువకులు నృత్యాలతో తీరం కోలాహలంగా మారింది.

వాడ్రాపల్లి ఆవలో...

మునగపాక: మండల వ్యాప్తంగా గణనాథుల నిమజ్జనం వేడుకలు ఘనంగా జరిగాయి. వాడ్రాపల్లి గ్రామంలో గణనాథులను దోనెలపై తీసుకు వెళ్లి ఆవలో నిమజ్జనం చేశారు. ఈ వేడుకల్లో యువకులు, గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



వాడ్రాపల్లి ఆవలో నిమజ్జనానికి దోనెపై తీసుకు వెళ్తున్న గణనాథ విగ్రహాలు



పూడిమడక తీరంలో నిమజ్జనంలో యువత సందడి



యలమంచిలిలో జరిగిన ఊరేగింపులో ఆకట్టుకున్న వేషధారణలు

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

మునగపాక, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేషస్పందన లభించినట్టు టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్ తెలిపారు. సంతబయల రామాలయంలో ఆదివారం ఆయన ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి విజయనగరం వారి సౌజన్యంతో వైద్య సేవలందించారు. సుమారు 150 మందికి కంటి వైద్య నిపుణులు పైల వెంకటలక్ష్మి పరీక్షలు నిర్వహించారు. వారిలో 32 మందికి ఆపరేషనకు గుర్తించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు విల్లూరి నూకనర్సింగరావు, దాడి శివ, భీమునాయుడు, పి.శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ఆలయాలు మూసివేత

ఎలమంచిలి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చంద్ర గ్రహణం సందర్భంగా ఎలమంచిలిలోని పలు ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసివేశారు. పట్టణంలోని కొత్తపేట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాలతో పాటు, రామలింగేశ్వర స్వామి, వీరభద్రస్వామి ఆలయాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేసిన అనంతరం ఆలయాన్ని మూసివేసారు. వీటితో పాటు మునిసిపాలిటీ, మండలంలోని ఆలయాలను మూసివేసారు.

పసలమారమ్మ రైతు సంఘం అధ్యక్షుడిగా రమణబాబు ఎన్నిక

మునగపాక, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసలమారమ్మ రైతు సంఘం అధ్యక్షుడిగా కొయిలాడ రమణబాబు ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన సంఘ సమావేశంలో సభ్యులు నూతన కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. కార్యదర్శిగా కాండ్రేగుల రమణబాబు, కోశాధికారిగా ఆళ్ళ జగ్గఅప్పారావు, సభ్యులుగా మొల్లేటి వెంకటఅప్పారావు, భీశెట్టి రమణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మూడు లారీలకు జరిమానా

నక్కపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేంపాడు హైవే టోల్‌ప్లాజా మీదుగా వెళితే టోల్‌ఫీజు చెల్లించకుండా కొంతమంది లారీ డ్రైవర్లు టోల్‌ప్లాజా పక్క నుంచి తమ వాహనాలను నడుపుతున్నారు. శనివారం రాత్రి వినాయక నిమజ్జనం నిమిత్తం బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్న సీఐ కె.కుమారస్వామి ఉపమాక వచ్చే సమయానికి వరుసగా భారీ లోడుతో వెళ్తున్న టిప్పర్ లారీలు మూడు కనిపించాయి. టోల్‌ఫీజును చెల్లించకుండా ఈ వాహనాలను నడుపుతున్నట్టు గుర్తించారు. వెంటనే మూడు లారీలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నర్సీపట్నం ఆర్‌టీవో కార్యాలయానికి అప్పగించగా.. ఓ లారీకి రూ.58 వేలు, మరో లారీకి రూ.52 వేలు, మరో లారీకి రూ.72 వేలు జరిమానా విధించినట్టు సీఐ చెప్పారు.

వైభవంగా పసరమారమ్మ పండగ

మునగపాక, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పసరమారమ్మ పండుగను ఆదివారం వైభవంగా నిర్వహించారు. పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పండగ జరిగింది. గ్రామ పురవీధుల్లో ఘటాల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఐదు మద్దాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, పెంటకోట సత్యనారాయణ, పలువురు వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పాయకరావుపేట/పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తున్నదని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ తోట నగేశ్ అన్నారు. పాయకరావుపేట పీఏసీఎస్‌లో సభ్య రైతులకు ఆదివారం యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగవుతున్న వరి పంటకు అవసరమైన యూరియా కొరత లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ దేవవరపు రాజబాబు, టీడీపీ మండల మాజీ అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, పట్టణ పార్టీ అధ్యక్షులు యాళ్ళ వరహాలబాబుతోపాటు నాయకులు పెదిరెడ్డి శ్రీను, బొంది కాశీ, గొర్రెల రాజబాబు పాల్గొన్నారు. అలాగే మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఆదివారం యూరియాపై అవగాహనా సదస్సులు నిర్వహించారు. ఎంత యూరియా అవసరం ఉన్నదీ గ్రామాల వారీగా వివరాలు సేకరించారు. రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఈ సందర్భంగా తహశీల్దార్ మహేశ్వరరావు, ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు, ఏవో ఆదినారాయణ తెలిపారు.



పాయకరావుపేట పీఏసీఎస్‌లో యూరియా పంపిణీ చేస్తున్న దృశ్యం

అందుబాటులో ఎరువులు

ఎలమంచిలి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఈ నెల 10, 11 తేదీల్లో ఎరువులు అందుబాటులో ఉంటాయని తహశీల్దారు కె. వరహాలుసూచించారు. ఆదివారం మునిసిపాలిటీ పరిధి కొక్కిరాపల్లి వార్డులో రైతులతో సమావేశం నిర్వహించారు. యూరియా కొరత ఉందని వస్తున్న దుష్ప్రచారంపై కలెక్టరు ఆదేశాలపై రైతులతో ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వం రైతులకు అవసరమైన యూరియాను అందించేందుకు ఇప్పటికే జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించినట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు గొర్లె నానాజీ, మజ్జి రామకృష్ణ, మజ్జి రాంబాబు పాల్గొన్నారు.

యూరియాపై ఆందోళన వద్దు

ఎస్. రాయవరం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): యూరియా పంపిణీ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహశీల్దార్ రమేశ్‌బాబు తెలిపారు. మండలంలోని ధర్మవరం అగ్రహారం, దార్లపూడి, పెదగుమ్ములూరు, చినగుమ్ములూరు, పెట్టుగోళ్లపల్లి, భీమవరం, గోకులపాడు, తిమ్మాపురం, పెదఉప్పలం, గుడివాడ, గుర్రాజుపేట, పెనుగొల్లు, వమ్మవరం, సర్వసిద్ధి గ్రామాల్లో ఆదివారం అధికారులు బృందాలుగా రైతులతో సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూరియా పంపిణీపై రైతులకు అవగాహన కల్పించారు. కావాల్సిన యూరియా అందుబాటులో ఉందని, భయపడాల్సిన అవసరం లేదని రైతులకు అధికారులు సూచించారు. అలాగే యూరియా దొరకదనే అపోహతో పలు చోట్ల ఎక్కువ కొనుగోలు చేసి దాచుకోవడం వంటిది చేయకూడదని, అవసరం నిమిత్తం సరిపడా యూరియా మాత్రమే కొనుగోలు చేసి వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో సత్యనారాయణ, మండల వ్యవసాయాధికారిణి సౌజన్య పాల్గొన్నారు.

ఎరువులపై అవగాహన కోసం గ్రామసభలు

కోటవురట్ల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించేందుకు అధికారులు బృందాలు ఏర్పడి ఆదివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. అలాగే వ్యవసాయశాఖ అధికారిణి సరోజని, తహసీల్దార్ తిరుమలబాబు రైతులకు యూరియా సరఫరాచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 248 టన్నులు యూరియా సరఫరా అయినట్టు తెలిపారు. మరో రెండు రోజుల్లో 52 టన్నుల యూరియా కావాలని ప్రతిపాదనలు పంపించినట్టు చెప్పారు. ఎంపీడీవో చంద్రశేఖర్, ఎస్ఐ రమేశ్ ఆధ్వర్యంలో రెండు బృందాలు గ్రామాల్లో పర్యటించి రైతులకు యూరియా వినియోగంపై అవగాహన కల్పించారు. యూరియా కొరత లేదని రైతులకు భరోసా కల్పించారు. అయితే వరితో పాటు అన్ని రకాల పంటలకు యూరియా అందుబాటులో ఉందన్నారు. పొటాషియం రిలీసింగ్ బాక్టిరియా వంటి బయోఫర్టిలైజర్స్ వినియోగించి తక్కువ ఖర్చుతో ఆరోగ్యవంతమైన పంటలు పండించి అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు.

ఎరువుల వినియోగంపై రైతులకు సూచనలు

నక్కపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీడీవో డి.సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు ఆదివారం పర్యటించారు. దేవవరం రైతు సేవా కేంద్రంలో ఎరువుల వాడకంపై రైతులకు పలు సూచనలు చేశారు. అర్హులందరికీ ఎరువులను అందుబాటులో వుంచాలని హోం మంత్రి అనిత ఆదేశించారని, వ్యవసాయశాఖాధికారులతో కూడా ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామని చెప్పారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దేవర సత్యనారాయణ కార్యక్రమంలో పాల్గొన్నారు. డొంకాడ గ్రామంలో సభ నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. జి.జగన్నాథపురం, డొంకాడ కొత్తూరు గ్రామసభల్లో ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవోలు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై సంఘటిత పోరాటాలు

» సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు

చోడవరం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై సంఘటితంగా పోరాడాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. చోడవరంలోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్న సీఐటీయూ జిల్లా 13వ మహాసభలు రెండో రోజు ఆదివారం ఆయన ప్రసంగించారు. ప్రభుత్వ విధానాలతో కార్మిక వర్గం మరింత బానిసత్వంలో కూరుకునిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌లు అమలైతే కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిపోతుందని వాపోయారు. ఇప్పటికే పని గంటలు పెంచుతూ కార్మికులపై ప్రభుత్వం పరోక్షంగా ఒత్తిడి చర్యలు ప్రారంభించిందన్నారు. సమష్టి పోరాటాల ద్వారానే కార్మికులకు న్యాయం జరుగుతుందని, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కూడా కార్మికులు ముందుకు రావాలని పేర్కొన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు, ఉద్యోగ భద్రత, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై పోరాటాలు చేపట్టాలన్నారు. ఈ సభలో రాష్ట్ర కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, జిల్లా



జిల్లా మహాసభలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

అధ్యక్షుడు లోకనాథం, కార్యదర్శి ఆర్‌కేఎస్ కుమార్, విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు చెందిన సీఐటీయూ నాయకులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, వీవీ శ్రీనివాసరావు, గూనూరు వరలక్ష్మి, ఎస్‌వీ.నాయుడు, ప్రేమచంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. సభలో 28 తీర్మానాలు ఆమోదించి, వాటి అమలుకు కార్యాచరణ రూపొందించారు.

మహిళలకు ఉచిత వైద్య శిబిరం

పాయకరావుపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వికాసతరంగిణి ఆధ్వర్యంలో ఆదివారం పాయకరావుపేటలో మహిళల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక చేనేత సొసైటీ ఆవరణలో టీడీపీ నాయకుడు గూటూరు శ్రీనివాసరావు ఆర్థిక సాయంతో మహిళ ఆరోగ్య వికాస్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరంలో ప్రముఖ గైనకాలజిస్టు పుష్ప సుమారు 100 మంది మహిళలకు గర్భాశయ, రొమ్ము పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టెక్నీషియన్లు అనంతలక్ష్మి, రమ్య, మాధురి, అండాళ్ రిందాదేవి, శైలజ, దేవి, రాణి, శ్రీదేవి, స్వప్న, వార్డు సభ్యులు ఎం.వెంకటరమణ, సొసైటీ మేనేజరు గోరు వీరనాగేశ్వరరావు, బి.దొంగబాబు, నరేశ్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

పాయకరావుపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సుతో ఉపాధి కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. ఆదివారం శ్రీదుర్గా ఉషోదయ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక గౌతమ్ థియేటర్ నుంచి వై జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటోలకు డిమాండ్ తగ్గి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ప్రభుత్వం స్పందించి జీవనోపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లను ఆర్థిక సాయమందించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు లావేటి ఈశ్వరరావు, వి.అప్పారావు, గొల్లపల్లి బుజ్జి, పప్పు నాగేశ్వరరావు, కిల్లాడ రమణ, నల్లమట్టి అర్జున్ పాల్గొన్నారు.

నాటక ఆకాడమి డైరెక్టర్‌కు సత్కారం

పాయకరావుపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నాటక ఆకాడమి డైరెక్టర్‌గా నియమితులైన టీడీపీ నేత పల్లా విలియంకేరిని నాయకులు ఘనంగా సత్కరించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షులు చించెలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షులు యాళ్ల వరహాలబాబు, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ దేవవరపు రాజబాబు, మజ్జూరి నారాయణరావు సత్కరించారు. నాయకులు గొల్లపల్లి నాగు, మలిపెద్ది సతీశ్, సలికే రమణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మూడో విడత డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన

విశాఖపట్నం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ మెరిట్ జాబితా మేరకు మూడోవిడత అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఆదివారం ఉక్కు నగరం విశాఖ విమల విద్యాలయంలో నిర్వహించారు. మొత్తం 23 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇప్పటివరకు రెండువిడతల్లో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తికాగా మూడోవిడత ఆదివారం నిర్వహించామని డీఈవో నిమ్మక ప్రేమ్‌కుమార్ తెలిపారు.

కూటమి హయాంలో రజకులు అన్ని రంగాల్లో అభివృద్ధి

... 5వ పేజీ తరువాయి

ఆధునికతో కలిపి ముందుకు తీసుకెళ్లానన్నారు. ఈ కార్యక్రమంలో రజక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సావిత్రి, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణశ్రీనివాస్, పంచకర్ల రమేశ్‌బాబు, ఈశ్వరరావు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు, కార్పొరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయం.. రాళ్లతో భయం..

- దారుణంగా మెట్టపాలెం- పాత రాజన్నపాలెం రహదారి
- రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- వర్షాలు కురిస్తే మరిన్ని కష్టాలు
- పట్టించుకోని అధికారులు



రాళ్లు తేలిన మెట్టపాలెం- పాత రాజన్నపాలెం రహదారి

పరవాడ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ పరిధి మెట్టపాలెం- పాత రాజన్నపాలెం రహదారి అధ్వానంగా తయారైంది. దారి పొడువునా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో రాకపోకలు సాగించే గ్రామీణ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీనికితోడు దెబ్బతిన్న రహదారిపై రాళ్లు తేలి ఉండటంతో నడవలేని పరిస్థితి నెలకొంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ రహదారికి కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేదు. వర్షాల సమయంలో రహదారిపై ఉన్న గోతుల్లో నీరు చేరడంతో ఎక్కడ అడుగు వేస్తే ఏం ప్రమాదం జరుగుతుందోనని భయం గ్రామీణ ప్రజలను వెంటాడుతోంది. ద్విచక్ర వాహనదారుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. రహదారిపై ఏర్పడిన గుంతలు కారణంగా తరచూ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని గగ్గోలు పెడుతున్నారు. అలాగే పండించిన కూరగాయలను ఆటోలు, ద్విచక్ర వాహనాలపై తీసుకొచ్చే క్రమంలో గుంతలు కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుంటే, చీకటి పడితే ఈ రహదారి గుండా ప్రయాణం నరకాన్ని తలపిస్తోందని స్థానికులు చెబుతున్నారు. పెద్ద గుంతలు, పైకి తేలి ఉన్న రాళ్లు కారణంగా నడిచి వెళ్లడం కూడా కష్టమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజూ ఇబ్బందులు పడుతూనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వమైనా స్పందించి రహదారికి తక్షణమే మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మెట్టపాలెం గ్రామం ఎంట్రన్స్‌లో...

నూకాంబిక ఆలయంలో సందడి

- వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు
- పసుపు, కుంకుమలు సమర్పించి పూజలు



బాలాలయంలో అమ్మవారు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక అమ్మవారిని ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం మూడు గంటల వరకే దర్శనాలు ఉంటాయని ఆలయ అధికారులు ముందుగానే ప్రకటించడంతో తెల్లవారుజాము ఐదు గంటల నుంచే ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రావడం ప్రారంభించారు. చాలా మంది కుటుంబాలతో వచ్చి పసుపు, కుంకుమలను సర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ, పరిసర ప్రాంతాల్లో వంటలు ఒండుకుని నైవేద్యంగా సమర్పించి ఆరగించారు. ఆలయ అధికారులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టారు. ఇదిలావుంటే, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వేదుల సూర్యప్రభ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాండ్రేగుల రాజు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి దర్శనానికి కూ లైన్లలో వేచి ఉన్న భక్తులు

'దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి'



ట్రై సైకిల్, వీల్‌చైర్ పొందిన దివ్యాంగులతో వీరుయాదవ్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల జిల్లా సంక్షేమ శాఖ దివ్యాంగులైన మాటూరు ఏసుదాసు, వినోద్ దిలీప్‌లకు ట్రై సైకిల్, వీల్‌చైర్‌లను మంజూరు చేసింది. వీటిని ఆదివారం ఇక్కడ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పాత్రపల్లి వీరుయాదవ్ అందజేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో మహిళల కోసం స్త్రీ శక్తి పథకం ప్రవేశపెట్టి తద్వారా రాష్ట్రంలో ఎక్కడికైనా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం హర్షణీయమన్నారు. అలాగే నిస్సహాయులైన దివ్యాంగులకు కూడా సదరం సర్టిఫికెట్ ఆధారంగా బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నామా చంద్రశేఖర్, శెట్టిపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారి ఊంజల్ సేవ



శ్రీవారికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : దేమునిగుమ్మం వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి శ్రీవారి ఊంజల్ సేవను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు బొలిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మద్దాల కృష్ణారావు, లక్ష్మి దంపతులు, అమరపల్లి కృష్ణాజీ దంపతులు, కశిరెడ్డి సూరిబాబు దంపతులు, దాసరి రామకృష్ణ దంపతులు ఊంజల్ సేవను జరిపారు. అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని వ్యవస్థాపకులు తిమ్మాపాత్రుని చక్రవర్తి బృందం అన్నమాచార్య కీర్తనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారుల శ్రీనివాస కల్యాణం నృత్యరూపకం అలరించింది. ఈ కార్యక్రమంలో అర్చకులు పులకండం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి పేరిట బాలీబాల్ టోర్నమెంట్



పోటీలను ప్రారంభిస్తున్న శాప్ డైరెక్టర్ పీబీవీఎస్ఎన్ రాజు

సబ్బవరం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్నేహితుడి పేరుతో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించి తమ గొప్ప మనసును చాటుకున్నారు ఆ పూర్వ విద్యార్థులు. ఇక్కడి ప్రతిభ విద్యాలయంలో 2005-06 విద్యా సంవత్సరం పదో తరగతి చదువుకున్న బ్యాచ్‌లో అనకపల్లికి చెందిన కర్రి శేషు ఒకరు. అతడు వాలీబాల్ ప్లేయర్, 2022లో పాము కాటుకు గురై అకాల మరణం పొందాడు అప్పటి నుంచి ఏటా అతని పేరిట స్నేహితులు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ టోర్నమెంట్‌ను శాప్ డైరెక్టర్ పీబీవీఎస్ఎన్ రాజు ఆదివారం ప్రారంభించారు. అనంతరం విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ, పూర్వ విద్యార్థులు జి.వెంకీ, జి.రమేశ్, శేఖర్, స్వరూప్‌రెడ్డి, నాగేంద్ర, కుమారి, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కొత్తూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం రాజుపాలెం జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని రూరల్ పోలీసు స్టేషన్ ఏఎస్ఐ భూలోకరావు ఆదివారం తెలిపారు. ఈ వ్యక్తి ఫ్యాంటు ధరించి, షర్టు లేకుండా తెల్లని రంగులో ఉన్నాడన్నారు. ఐదున్నర అడుగుల పొడవు, మాసిన గెడ్డం, శరీరంపై పోసయ్య, అమ్మానాన్న అని పచ్చబొట్టు కూడా కలిగి ఉన్నాడని వివరించారు. శనివారం అర్ధరాత్రి సమయంలో అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని 108 అంబులెన్సు సహాయంతో వీఆర్వో సురేష్ అనకాపల్లి ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	128.00
లైవ్ ధర	148.00
విత్ స్కిన్	266.00
స్కిన్ లెస్	276.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

యూరియా కొరత లేదు

- రైతులకు అవసరమైనంత స్టాక్ సిద్ధం : ఆర్డీవో ఆయిషా



కూండ్రం గ్రామ సభలో మాట్లాడుతున్న ఆర్డీవో షేక్ ఆయిషా

కొత్తూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు తమ పంటలకు వేసుకునేందుకు అవసరమైనంత నిల్వలు గోడౌన్లలో ఉన్నాయని ఆర్డీవో షేక్ ఆయిషా తెలిపారు. అనకాపల్లి మండలం కూండ్రం రైతు సేవా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన గ్రామ సభలో రైతులనుద్దేశించి మాట్లాడారు. కేవలం వరి, చెరకు పంటలకే కాకుండా ఇతర పంటల సాగుకు యూరియా అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎక్కడికక్కడ డిమాండ్ కనిపిస్తుందని, అయితే కొరత ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే అధికారుల బృందాలు స్టాక్ నివేదికలను పరిశీలించారన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ కూడా స్వయంగా పర్యటించి వివరాలను తెలుసుకుంటున్నారని వివరించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ శాంతిభూషణరావు మాట్లాడుతూ రైతులకు అవసరమైన యూరియా సరఫరా అయ్యేలా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నందారపు లక్ష్మి, గ్రామ పెద్దలు తట్ట పెంటయ్యనాయుడు, కృష్ణమోహన్, కార్యదర్శులు లక్ష్మి, ఈశ్వరరావు, వీఆర్వో అనంత రామయ్య తదితరులు పాల్గొన్నారు.

దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి : ఎమ్మెల్యే పంచకర్ల

సబ్బవరం : పెందుర్తి నియోజకవర్గంలో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు స్పష్టం చేశారు.



పైడివాడ అగ్రహారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పైడివాడ అగ్రహారంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కొంత మంది వ్యాపారులు సృష్టించిన కృత్రిమ కొరతను సాకుగా చూపించి కూటమి ప్రభుత్వంపై వైసీపీ సోషల్ మీడియా ద్వారా తప్పుడు ఆరోపణలు చేస్తుందని మండిపడ్డారు. దమ్ముంటే వైసీపీ అధినేత జగన్ అసెంబ్లీకి వచ్చి ఈ విషయంపై చర్చించాలని ఆయన సవాల్ విసిరారు. మండల వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణను ఎరువుల నిల్వల గురించి అడిగి తెలుసుకున్నారు. మండలంలో సాధారణ వరి సాగు విస్తీర్ణం 1358 హెక్టార్లు కాగా, ఇప్పటి వరకూ 1212 హెక్టార్లలో రైతులు నాట్లు వేశారన్నారు. ఇందుకు 350 టన్నుల యూరియా అవసం కాగా, ఇప్పటి వరకు 311 టన్నుల పంపిణీ చేసినట్టు చెప్పారు. మరో 18 టన్నులు స్టాక్ ఉందని, సోమవారం 30 టన్నులు రానుందని ఆయన ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు ఇందలి వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు శీరం అప్పలరాజు, అక్కిరెడ్డి దుర్గినాయుడు, దొడ్డి ప్రకాశ్, బొబ్బరి కన్నారావు, గొంతిన పైడిరాజు, కర్రి కనకరాజు పాల్గొన్నారు.

ఇదిలావుంటే, మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, ఎంపీడీవో పి.పద్మజ, ఏవో పోతల సత్యనారాయణ, ఎస్‌హెచ్‌వో రామచంద్రరాజు, ఎంఈవో బాలరాజు బృందం సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఎరువుల కొరత లేదన్నారు. కొన్నిరోజులుగా ఎరువులపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని రైతులు నమ్మవద్దన్నారు. ఎక్కువ మోతాదులో ఎరువుల వినియోగం మంచిది కాదన్నారు. పీఏసీఎస్ చైర్మన్ గండి దేముడు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో పాటు నాయకులు కొటాన అప్పారావు, పోతల కనకరాజు, కొటాన వెంకటరమణ, దాడి లావణ్య, ఆకుల గణేశ్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి మంజూరు పత్రాల పంపిణీ



మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్న గండి బాబ్జీ

సబ్బవరం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు పెందుర్తి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి, ఏపీ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ అన్నారు. తీవ్ర అనారోగ్యానికి గురైన మండలంలోని బంగారమ్మపాలెనికి చెందిన పలువురికి సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలను ఆదివారం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు దాడి కన్నంనాయుడు, భరణికాన బాబూరావు, కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, దొడ్డి రాము, గవర అప్పారావు, యండపల్లి నానాజీ, ఉమా తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల, 'పేట' నియోజకవర్గాల వైసీపీ పరిశీలకుడిగా శ్రీనివాసరావు

పరవాడ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో గల మాడుగుల, పాయకరావుపేట నియోజకవర్గాలకు వైసీపీ అసెంబ్లీ పరిశీలకునిగా పరవాడకు చెందిన పైలా శ్రీనివాసరావును నియమిస్తూ పార్టీ అధిష్ఠానం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈయన వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్నారు. పాయకరావుపేట, మాడుగుల నియోజకవర్గాల్లో పార్టీ తరఫున కార్యక్రమాలు చేపడుతూ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆయన వివరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విజయరామరాజుపేట అండర్ పాస్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి మృతిచెందాడు. ఇందుకు సంబంధించి ట్రాఫిక్ ఎస్ఐ శేఖరం తెలిపిన వివరాలివి. కశింకోట గ్రామం అగ్రహారం వీధికి చెందిన ద్వారపురెడ్డి మనోజ్‌కుమార్ (30) శనివారం రాత్రి పది గంటల సమయంలో స్థానిక మిరియాల కాలనీకి ద్విచక్ర వాహనంపై వచ్చాడు. తిరిగి వెళ్తుండగా అండర్ పాస్ వద్దకు చేరడంతో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. వెంటనే ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రథమ చికిత్సలు అనంతరం స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్టు మృతుడు భార్య కవిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

'విశాఖ రైల్వే స్టేషన్‌కు అరుదైన గుర్తింపు హర్షణీయం'

అనకాపల్లి రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణలో విశాఖ రైల్వేస్టేషన్ మరో అరుదైన విజయం సాధించడం పట్ల రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గ్లోబల్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ ప్రకటించిన 'గ్రీన్ రైల్వేస్టేషన్' ప్లాటినమ్ సర్టిఫికేట్‌ను అందుకోవడం విశాఖ రైల్వే స్టేషన్‌కు గొప్ప గౌరవమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలను సొంతం చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

15 నుంచి ఉపాధ్యాయ సమస్యలపై 'రణభేరి ప్రచార జాత'

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యల సాధనకు ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు రణభేరి ప్రచార జాత నిర్వహించనున్నట్టు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి తెలిపారు. ఆదివారం ఇక్కడ జరిగిన ఫెడరేషన్ మధ్యంతర కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పీఆర్‌సీ, డీఏ, ఇతర బకాయిల సాధన కోసం ఈ కార్యక్రమాన్ని తలపెట్టామన్నారు. ఉపాధ్యాయులను కేవలం చదువు చెప్పడానికి మాత్రమే వినియోగించుకోవాలని, అస్తవ్యస్తంగా పునర్ వ్యవస్థీకరించిన పాఠశాలల వ్యవస్థను సరిదిద్దాలని, ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ.25వేల కోట్ల ఆర్థిక బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. వీటి సాధనకు చేపట్టనున్న ప్రచార జాత 18న అనకాపల్లిలోకి ప్రవేశిస్తుందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం ముగిసేలోపు ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోతే సెప్టెంబరు 25వ తేదీన విజయవాడలో భారీ రణభేరి బహిరంగసభ నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, పి.వెంకటరావు, యల్లయ్యబాబు, జోగా రాజేష్, రొంగలి ఉమాదేవి, ఎస్ఎస్ నాగమణి, జీకేఆర్ స్వామి, అలివేలు తదితరులు పాల్గొన్నారు.



రణభేరి ప్రచార జాత బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు



వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకు వస్తున్న భక్తులు

ఘనంగా వినాయక విగ్రహాల నిమజ్జనం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి శారదా నదిలో ఆది వారం కూడా వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం ఘనంగా జరిగింది. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో వీధి వీధినా కొలువుదీరిన ఆది దేవుని విగ్రహాలను మేళతాళాలు, యువత కేరింత నడుమ నది వద్దకు తీసుకు వచ్చారు. అనంతరం భారీ విగ్రహాలను క్రేన్ సాయంతో నిమజ్జనం చేశారు. వినాయక నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు



వినాయక విగ్రహాన్ని క్రేన్ ద్వారా శారదా నదిలో నమజ్జనం చేస్తున్న దృశ్యం

ఏపీటీఎఫ్ కశింకోట మండల కార్యవర్గం ఎన్నిక

కశింకోట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఏపీటీఎఫ్ మండల సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం ఇక్కడ నిర్వహించారు. పూర్వపు రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటపతి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.త్రినాథ్, జిల్లా అధ్యక్షుడు కేవీఎల్ఎన్ ధర్మారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. దుర్గాప్రసాద్ హాజరై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఎం.రమణ, మండల అధ్యక్షుడిగా కె.సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పీఎం అప్పారావు, ఉపాధ్యక్షులుగా జి.దేముడుబాబు, టి.తాయారమ్మ, జి.సునీత, వై.శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్‌గా పి.గణపతి, డి.ఎస్.మల్లేశ్వరరావు, ఇ.ఎం.రఘురామ్, పి.బలరాం, డి.సత్యనారాయణ, కార్యదర్శులుగా ఎంఎస్ క్రిస్టోఫర్, పీవీడీ ప్రసాద్, కె.వగలేశ్వరరావు, డి.శ్రీదేవి, యు.ఉషాకిరణ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు.

ఏఎంఏఎల్ కళాశాల పూర్వ వైభవానికి కృషి

- ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పిలుపు



పూర్వ అధ్యాపకులను సత్కరిస్తున్న కొణతాల, మాజీ వీసీ ముత్యాలనాయుడు

కొత్తూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏఎంఏఎల్ కళాశాలలో చదువుకున్న వారిలో ఎంతో మంది ఇప్పుడు ఉన్నత స్థానాల్లో ఉన్నారని అందరూ కలిసి కళాశాలకు పూర్వ వైభవం కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. కళాశాలకు సమీపంలో వున్న ఒక ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన ఏఎంఏఎల్ కళాశాల పూర్వ విద్యార్థుల (1973 నుంచి 2021 వరకు ఎం.కాం. చదువుకున్న వారు) ఆత్మీయ సమావేశానికి సుమారు 500 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనకాపల్లికి చెందిన బెల్లం వ్యాపారులు సమాజం కోసం ఒక వర్తక సంఘాన్ని ఏర్పాటు చేసి, ఏపీలో మొట్టమొదటి ప్రసూతి ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకువచారని చెప్పారు. తరువాత ఏఎంఏఎల్ కళాశాలను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కళాశాలలో 1977-79లో ఎం.కాం. చదివిన తాను ఒకసారి కమిటీ అధ్యక్షుడిగా పని చేశానని గుర్తు చేశారు. ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు, పూర్వ అధ్యాపకులు బుద్ధ అప్పారావు, రాజేశ్వరప్రసాద్, గోపాలరావు, సర్వేశ్వరరావు, బేగ్‌లను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమానికి కో-ఆర్డినేటర్‌లుగా హరిహరప్రసాద్, వెంకట్, సునీల్‌కుమార్, కె.వి.లక్ష్మీనారాయణ, వంకాయల శివశంకర్ వ్యవహరించారు.

ప్రేమపేరుతో యువకుడి హల్‌చల్

» సెల్‌టవర్‌పైకి ఎక్కి నిరసన .. పోలీసుల కౌన్సెలింగ్


మినుములూరులో సెల్‌టవర్‌పైన యువకుడు కిరణ్ కుమార్

పాడేరురూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఓ వివాహితను ప్రేమించాలంటూ వెంట పడుతున్న యువకుడు హల్‌చల్ చేశాడు. సెల్‌టవర్‌పైకి వెళ్లి నిరసన తెలిపాడు. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని అతనిని స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చి.. అనంతరం విడిచిపెట్టారు. మండలంలోని మినుములూరు గ్రామంలో ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఎల్.సురేశ్ కథనం ప్రకారం.. మినుములూరుకు చెందిన కిరణ్ కుమార్ అదే గ్రామానికి చెందిన వివాహిత అయిన ఓ యువతిని ప్రేమించాలని వెంట పడుతున్నాడు. అందుకు ఆమె నిరాకరించడంతో గ్రామంలో ఉన్న సెల్‌టవర్ పైకి వెళ్లి హల్‌చల్ చేస్తుండటంతో గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సురేశ్ సంఘటనాస్థలానికి చేరుకొని యువకుడిని వారించి కిందికి దించారు. అక్కడి నుంచి కిరణ్‌కుమార్‌ను, అతని తల్లిదండ్రులను పోలీసు స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ చేసి, మరోసారి ఇటువంటి ఘటనకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించి విడిచిపెట్టారు.

మామిడి మొక్కలు పంపిణీ


మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ బాలకృష్ణ

కొయ్యూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) రైతుల ఆర్థికాభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని బట్టపణుకులు సర్పంచ్ బాలకృష్ణ పేర్కొన్నారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో రైతులకు పండ్ల తోటలు పెంపకానికి ప్రోత్సహించే చర్యల్లో భాగంగా సరఫరా అయిన మామిడి మొక్కలను బట్టపణుకుల పంచాయతీ కాట్రగెడ్డ గ్రామంలో మామిడి పెంటయ్య తదితర రైతులకు ఆదివారం సర్పంచ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్, సిబ్బంది మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కావున ప్రభుత్వ ఆలోచనకు తగినట్టుగా ఆర్థికాభివృద్ధి చేందేందుకు వీలుగా పండ్ల తోటలను శ్రద్ధాశక్తులతో పెంచి ప్రభుత్వ ఆశయం నెరవేర్చాలని సూచించారు. పండ్ల తోటలు పెంచే ఆసక్తి గల వారు తమకు ఏ జాతి మొక్కలు అవసరమో తెలిపితే సరఫరా చేయటం జరుగుతుందని, అలాగే మొక్కల సంరక్షణకు ఆర్థికంగా సహాయం అందించటం జరుగుతుందని ఏపీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో అప్పలరాజు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురి వైద్యులకు బదిలీ


వైద్యాధికారి ఇందిరా ప్రియాంకకు జ్ఞాపికను అందజేస్తున్న నాయకులు

చింతపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రి నుంచి ముగ్గురు వైద్యులు మైదాన ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం వైద్యులకు పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు స్థానిక ఏరియా ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా రెండున్నర ఏళ్లు పనిచేసిన డాక్టర్ పి. ఇందిరా ప్రియాంకను డిప్యూటీ సివిల్ సర్జన్ పదోన్నతి కల్పించి విజయనగరం జిల్లా చీపురుపల్లికి బదిలీ అయ్యారు. అలాగే, ఆరు నెలలుగా అసిస్టెంట్ సివిల్ సర్జన్ క్యాడర్‌లో జనరల్ మెడిషిన్ సంతోష్ డిప్యూటీ సివిల్ సర్జన్ స్పెషలిస్టుగా పదోన్నతి కల్పిస్తూ బదిలీ చేశారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ రెడ్డి భారతిని కోటవూరట్ల సీహెచ్‌సీకి బదిలీ చేశారు. ముగ్గురు వైద్యులు శనివారం రిలీవ్ అయ్యారు. బదిలీకాబడిన వైద్యుల స్థానంలో ఎవరినీ నియమించలేదు. కాగా బదిలీపై వెళుతున్న వైద్యాధికారి ఇందిరా ప్రియాంకను ఆదివారం కూటమి నాయకులు రీమల ఆనందరావు, లక్కోజు నాగభూషణం జ్ఞాపికతో సత్కరించారు.

మూసివేసి ఆలయాలు


ఆదివారం మధ్యాహ్నం నుంచి మూతపడ్డ మోదకొండమ్మ ఆలయం

పాడేరు రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆదివారం రాత్రి నుంచి చంద్ర గ్రహణం నేపథ్యంలో పట్టణంలోని ప్రముఖ మోదకొండమ్మ, ఉమానీలకంఠేశ్వరస్వామి సమేత రాజరాజేశ్వరి, పూర్ణపుష్కల అయ్యప్ప స్వామి ఆలయం, కనకదుర్గ, షిర్డీసాయి, స్వయంభూ లింగేశ్వర స్వామి ఆలయం, త్రిలింగేశ్వరస్వామి ఆలయంతో పాటు పాడేరు ఘాట్‌లో మోదాపల్లి జంక్షన్ వద్ద గల మోదకొండమ్మ అమ్మవారి పాదాల ఆలయాలను మధ్యాహ్నం 1 గంట నుంచి మూసివేశారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ కార్యక్రమాల అనంతరం యథావిధిగా ఆలయాలను తెరుస్తామని ఆలయ ప్రధాన అర్చకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. మోదకొండమ్మను దర్శించుకొనేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటల వరకు అమ్మవారి దర్శనం చేసుకున్నారు. గ్రహణం నేపథ్యంలో మధ్యాహ్నం ఉచిత అన్న ప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని నిలిపివేశారు.

ఆలయానికి ఐరన్ స్టాండ్ బహూకరణ


ఉమానీలకంఠేశ్వర ఆలయానికి ఐరన్ స్టాండ్ వితరణ

పాడేరురూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పురాతన శైవ క్షేత్రం ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి పాడేరు లోచలిపుట్టుకు చెందిన భక్తుడు బెహరా గౌరీ సంతోశ్ ఐరన్ స్టాండ్‌ను ఆదివారం బహూకరించినట్టు ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు తెలిపారు. స్వామి వారి గర్భగుడిలో పూజా సామగ్రిని ఉంచేందుకు భక్తుడు ఈ స్టాండ్ అందించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక సేవా బృంద సభ్యులు చీపురు రమాదేవి, అర్చకుడు రామం పంతులు, ఆలయ ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటరత్నం, కొట్టగుళ్లి రామారావు, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, రాజబాబు, గాయత్రిదేవి, యాదగిరి శ్రీనివాసరావు, వసంత తదితరులు పాల్గొన్నారు.


మరమ్మతులు తరువాత అందుబాటులోకి వచ్చిన 108 వాహనం


వాహనం లోపల పూర్తి సదుపాయాలతో ఉన్న దృశ్యం

ఫుల్ కండిషన్‌లో 108 వాహనాలు

» అనంతగిరిలో వాహనానికి మొదటి విడతగా మరమ్మతులు, పెయింటింగ్

» రోగులకు ఇబ్బంది లేకుండా జిల్లాలోని 26 అంబులెన్స్‌లకు పూర్తిస్థాయి పనులు

అనంతగిరి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకందిస్తున్న పలు పథకాల్లో ఒక్కొక్కటీ మార్పునకు శ్రీకారం చుడుతోంది. నిన్నమొన్నటి వరకు కుయ్.. కుయ్ మంటూ ఏజెన్సీ వ్యాప్తంగా ఘాట్‌రోడ్లపై తిరిగే 108 వాహనాలు వివిధ రకాల మరమ్మతులు, కండిషన్ లేకపోవడం తదితర సమస్యలతో తరచూ ఆగిపోతుండేవి. ప్రస్తుతం ఈ సమస్యలను పరిష్కరించడంతోపాటు ఇంజన్‌తోపాటుగా వాహనాలకు సంబంధించి పూర్తిస్థాయి సామర్థ్యంతో పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నారు. 108 వాహనాలు ప్రస్తుతం నిర్వహణ బాధ్యతను భవ్య హెల్త్ చూస్తోంది.. అయితే, జిల్లా వ్యాప్తంగా 22 మండలాలకు గాను 26 అంబులెన్స్‌లు అందుబాటులో ఉండగా.. అనంతగిరి మండలానికి చెందిన అంబులెన్స్ వాహనాన్ని మూడు వారాల క్రితం విజయవాడ గ్యారేజ్‌కు పంపించి, మొత్తం మరమ్మతులు, పేయింటింగ్ వేసి పూర్తిస్థాయి సామర్థ్యంతో పనులు చేయించారు. జిల్లావ్యాప్తంగా ఆయా మండలాల్లో రోగులకు ఇబ్బందులు లేకుండా దఫదఫాలుగా వాహనాలను విజయవాడ పంపి మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు చేపడుతున్న భవ్య సంస్థ రీజినల్ మేనేజర్ బాలరాజు, జిల్లా కో ఆర్డినేటర్ స్యామూల్ చెప్పారు. పదిరోజుల్లో అన్నివాహనాలను అందుబాటులోకి వచ్చేవిధంగా కృషిచేస్తున్నామన్నారు.

కాఫీ తోటల్లో బెర్రీ బోరర్ తెగులుపై అప్రమత్తం


కాఫీ తోటల్లో అవగాహన కల్పిస్తున్న హెచ్‌వో అరుణకుమారి

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాఫీ తోటల్లో బెర్రీ బోరర్ తెగులు లక్షణాలు కనిపిస్తే వెంటనే ఉద్యానశాఖ, కేంద్రకాఫీ బోర్డు అధికారులకు సమాచారం ఇవ్వాలని ఉద్యానశాఖ అధికారి కె. అరుణకుమారి అన్నారు. ఆదివారం రింతాడ గ్రామపంచాయతీ చెలకవీధి గ్రామం కాఫీ తోటల్లో గిరిజన రైతుకలు కాఫీ బెర్రీ బోరర్ తెగులు లక్షణాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఉద్యానశాఖ అధికారి మాట్లాడుతూ కాఫీ కాయల్లో నల్లని రంధ్రం కనపిస్తే బెర్రీ బోరర్ తెలుగు సోకినట్టు గుర్తించాలన్నారు. ఈ తెగులును సకాలంలో నివారించుకోకవాలని, లేదంటే పంట నాశనమవుందన్నారు. రైతులు తోటలను పరిశీలించి తెగులు లక్షణాలు కనిపిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ సోమేశ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

దేవతా వృక్షాలు అందజేత


గిరికైలాస క్షేత్రానికి దేవతా వృక్షాలను అందిస్తున్న భక్తులు

పాడేరురూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): గిరి కైలాస క్షేత్రంగా పేరొందిన ఉమానీలకంఠేశ్వస్వామి వారి సమేత రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయానికి ఆధ్యాత్మిక సేవా బృంద సభ్యులు ఆదివారం పంచవటి (ఐదు రకాల) దేవత వృక్షాలను ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, రమాదేవి దంపతులకు ప్రధాన అర్చకుడు ఉప్పల రామం పంతులు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త మాట్లాడుతూ.. పురాత శైవక్షేత్రం అభివృద్ధికి సహకరిస్తున్న ఆధ్యాత్మిక సేవా బృంద సభ్యులు, గ్రామ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఇప్పటికే విశిష్టత గల పలు వృక్షాలను నాటామన్నారు. కొట్టగుళ్లి పోతురాజు,ఎస్.రామకృష్ణ, రొబ్బి నిర్మల, కృత్యాంజలి నాట్య అకాడమి గురువు, ఆధ్యాత్మిక బృంద సభ్యులు పాల్గొన్నారు.

గంజాయికి దూరంగా ఉండాలి


బొంగరం పంచాయతీలో మాట్లాడుతున్న సర్పంచ్ లక్ష్మీపతి

పెదబయలు, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): గంజాయికి దూరంగా ఉండాలని మండల పరిధిలోని మారుమూల పంచాయితీల గిరిజనులు, ప్రజా ప్రతినిధులు పిలుపునిచ్చారు. జామిగూడ, గిన్నెలకోట, బొంగరం, లింగేటి, కుంతుర్ల పంచాయితీల ప్రజలతో స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు ఆదివారం ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో పండించే గంజాయి ఎన్నో కుటుంబాలను ఛిద్రం చేస్తుందని అవగాహన కల్పించారు. గంజాయి సాగు, రవాణా అలాగే నిల్వ చేయడం చట్టరీత్యా నేరమని చెప్పారు. గంజాయి సాగుతో దళారులు, వ్యాపారులు బాగుపడ్డారు తప్పా ఏజెన్సీలో ఏ ఒక్క రైతుకు మేలు చేకూరలేదని వివరించారు. తిరిగి అమాయక గిరిజన యువత గంజాయి రవాణా చేస్తు పట్టుబడి జైలులో మగ్గుతున్నారని తెలిపారు. ఈ గంజాయి వల్ల బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని వివరించారు. కావునా మనమందరం స్వచ్ఛందంగా ఈ మహమ్మారి గంజాయిని నిషేదించి మన భావి తరాలకు భాసటగా నిలువాలని కంకణం కట్టుకున్నట్లు ప్రజాప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు లక్ష్మీపతి, చిన్నారావు, వెంకటరావు, మత్స్యకొండబాబు, చంద్రుబాబు తదితరులు పాల్గొన్నారు

ఉపాధ్యాయుడికి సన్మానం


బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు ఆనందరావుని సన్మానిస్తున్న దృశ్యం

కొయ్యూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి):బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు జె. ఆనందరావు సేవలు అభినందనీయమని వైఎస్ పాకలు గిరిజన సంక్షేమశాఖ బాలికల ఆశ్రమ పాఠశాల పీజీహెచ్‌ఎం గీతాంజలి అన్నారు. వైఎస్‌పాకలు నుంచి చింతపల్లి బాలూర ఆశ్రమ పాఠశాల-1కి బదిలీపై వెళ్లిన ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు ఆనందరావుని ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా పీజీహెచ్‌ఎం మాట్లాడుతూ ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు విధుల పట్ల అంకిత భావంతో పనిచేశారన్నారు. క్రమంగా పాఠశాలకు వస్తూ విద్యార్థినులకు అందుబాటులో ఉండేవారన్నారు. విద్యార్థినులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు ఆయన ప్రత్యేక కృషి చేశారన్నారు. ప్రతి ఏడాది పదోతరగతి విద్యార్థినులకు వ్యక్తిగత నిధులతో స్టడీ మెటీరిల్ అందజేస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు సత్యనారాయణ, మల్లేశ్వరి, సుధ, వసుపరి సత్యవతి, శాంతి, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం లక్ష్మి పాల్గొన్నారు.

వీవోఏల సంఘం నూతన కమిటీ నియామకం


నూతనంగా ఎన్నికైన వీవోఏల కార్యవర్గ సభ్యులు

జి.మాడుగుల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీవోఏల (యానిమేటర్స్) సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఎనుకున్నారు. సీఐటీయూ కో-కన్వీనర్, వివోఏల గౌరవ అధ్యక్షులు వి.మహేశ్ అధ్యక్షనలో ఏకగ్రీవంగా ఎనుకున్నారు. వీవోఏల మండల అధ్యక్షులుగా ఎస్.మత్యలింగం, కార్యదర్శిగా కె.దేవినాయుడు, సహాయ కార్యదర్శిగా ఎస్.లక్ష్మణ్‌ని వీరితో పాటు మరో 7మందిని సభ్యులను ఎన్నికయ్యారు. వీవోల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఈసందర్భంగా సంఘ ప్రతినిధులు అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలో అన్ని వీవోఏల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలలో సమస్యల పరిష్కారానికి కృషి

» ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ దొన్నుదొర


విద్యార్థినుల సమస్యలు తెలుసుకుంటున్న దొన్నుదొర

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లబ్బూరు ఏకలవ్య పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని టీడీపీ అరకు నియోజకవర్గం ఇన్‌చార్జి, ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర తెలిపారు. జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆదివారం దొన్నుదొర సందర్శించి తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ సుమన్‌తో పాటు విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అసంపూర్తిగా ఉన్న భవనాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి కూర్చొని భోజనం చేశారు. ఈ సందర్భంగా రోజూ నీటి సమస్య ఎదుర్కొంటున్నామని, మరుగుదొడ్లు, స్నానాలకు నీరు సరఫరా ఉండడం లేదని, వర్షం పడితే కొన్ని గదులలోకి నీరు ప్రవేశిస్తుందని విద్యార్థినులు దొన్నుదొరకు వివరించారు. తగినన్ని భవనాలు లేవని, ఫర్నీచర్ లేక నేల మీదనే కూర్చుంటున్నామన్నారు. మంచాలులేక నేలపై నిద్రిస్తున్నట్టు దొన్నుదొర దృష్టికి తీసుకువచ్చారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కారానికి తగు కృషి చేస్తానని ఈ సందర్భంగా దొన్నుదొర హామీ ఇచ్చారు. నీటి సమస్య పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు.


దారికి అడ్డంగా పడిన బండరాళ్లను తొలగిస్తున్న దొన్నుదొర, టీడీపీ నేతలు

రహదారిపై కొండచరియలు తొలగింపు

మండలంలోని అలబీరు రుంచి కడుతు గ్రామం వరకు నూతనంగా చేపట్టిన రహదారి పనులను దొన్నుదొర పరిశీలించారు. రహదారి శివారున గ్రామానికి కలుపుతూ జరగాల్సిన మిగిలిపోయిన పనులను వేగవంతగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. మొక్కాపుట్టు వెళ్లే మార్గంలో దారికి అడ్డంగా పడి ఉన్న బండరాళ్లను, చెట్లను దొన్నుదొరతో పాటు టీడీపీ శ్రేణులు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రహదారి నిర్మాణానికి నిధుల కోసం శ్రమించినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కె.సన్యాసమ్మ, కె.బలరాం, వి.రామస్వామి, కె.జగత్‌రాయ్, వి.లక్ష్మణ్, బి.రామారావు, చిన్నిబాబు, వి.జగదీశ్, బాబ్జీరావు, ఆర్.గణపతి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ యూనియన్ మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

అనంతగిరి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ యూనియన్ నూతన మండల కమిటీ ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. ఆదివారం అనంతగిరిలో మండల యూనియన్ మహాసభ పి.మంజుల అధ్యక్షతన జరిగింది. కమిటీ గౌరవ అధ్యక్షులుగా సీహెచ్ కళావతి, కార్యదర్శిగా సాగర సుమిత్ర ఎంపికయ్యారురు. 21 మందితో అనంతగిరి ప్రాజెక్టు నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా నియమించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు సీహెచ్ కళావతి మాట్లాడుతూ, గతంలో మనం 42 రోజులుగా సమ్మె చేయడంతో అనేక సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని సమస్యలు పరిష్కారానికి పోరాటానికి సిద్ధంగా ఉండాలని సభ్యులకు పిలుపునిచ్చారు. కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు పార్వతి, సుబ్బలక్ష్మి, చిలకమ్మ, సునీత, సంగీత, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మూడో విడత డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన

విశాఖపట్నం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ మెరిట్ జాబితా మేరకు మూడోవిడత అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఆదివారం ఉక్కు నగరం విశాఖ విమల విద్యాలయంలో నిర్వహించారు. మొత్తం 23 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇప్పటి వరకు రెండువిడతల్లో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తికాగా మూడోవిడత ఆదివారం నిర్వహించామని డీఈవో నిమ్మక ప్రేమ్‌కుమార్ తెలిపారు.

యూరియా కొరత లేదు

... 5వ పేజీ తరువాయి

వ్యవసాయాధికారి మోహన్‌రావు, మండల వ్యవసాయాధికారి స్వప్న, ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తదితరులు వున్నారు.

రైతులతో గ్రామసభ


అనకాపల్లి మండలం కూండ్రం ఆర్‌ఎస్‌కేలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో ఆయిషా

ఎరువుల సరఫరా, పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ, మండల పరిషత్, వ్యవసాయ శాఖ అధికారులు ఆదివారం జిల్లాలోని పలు గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించారు. అనకాపల్లి ఆర్డీవో ఆయిషా అనకాపల్లి మండలం కూండ్రం ఆర్‌ఎస్‌కే లో రైతులతో నిర్వహించిన సభలో మాట్లాడుతూ, జిల్లాలో యూరియా కొరత లేదని, వరి, చెరకే కాకుండా ఇతర పంటలకు సరిపడ ఉందన్నారు. నర్సీపట్నం డీఎల్‌డీవో నాగలక్ష్మి చీడికాడ, మాడుగుల మండలాల్లో స్థానిక అధికారులతో కలిసి పలు గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఎరువుల కోసం ఇబ్బందులు పడనవసరం లేదని, రైతులకు అవసరమైన మేర ఎరువులు సరఫరా చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా వుందన్నారు. నక్కపల్లి తహసీల్దార్ చిన్నికృష్ణ, ఎంపీడీవో పద్మజ, ఏవో పోతల సత్యనారాయణ, తదితర అధికారులు అన్ని సచివాలయాల పరిధిలోని రైతులతో సమావేశాలు నిర్వహించారు. మండలంలో ఎరువులు కొరత లేదని, దీనిపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. దేవరాపల్లి మండలంలో తహశీల్దార్ లక్ష్మీదేవి, ఎంపీడీఓ సువర్ణరాజు, ఎస్‌ఐ సత్యన్నారాయణ, వ్యవసాయ అధికారి ఎల్.వై. కాంతమ్మ వేర్వేరు బృందాలుగా ఏర్పడి మండలంలోని అన్ని పంచాయతీల్లో ఆదివారం గ్రామసభలు నిర్వహించారు. యూరియా కొరత ఉందంటూ చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని రైతులకు సూచించారు. గొలుగొండ తహశీల్దార్ శ్రీనివాసరావు, ఏవో సుధారాణి, ఎస్‌ఐ రామారావు, ఇన్‌చార్జి ఎంపీడీవో బాబూరావు, తదితరులు మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఆదివారం రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఖరీఫ్ అవరాలకు సరిపడ యూరియాను ఆర్‌ఎస్‌కేలు, పీఏసీఎస్‌లతోపాటు ప్రైవేటు డీలర్ల వద్ద అందుబాటులో వుంచామన్నారు. ఎలమంచిలి మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో ఈ నెల 10, 11 తేదీల్లో ఎరువులు అందుబాటులో ఉంటాయని తహశీల్దారు కె.వరహాలు ఆదివారం కొక్కిరాపల్లిలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వెల్లడించారు. మాడుగుల ఎంపీడీవో కొంకి అప్పారావు, తహశీల్దారు రమాదేవి, ఎస్‌ఐ నారాయణరావులు మూడు బృందాలుగా ఏర్పడి, ఒక్కో బృందం పది పంచాయతీల్లో రైతులతో సభలు నిర్వహించారు. ఆర్‌ఎస్‌కేలు, సహకార సంఘాల్లో యూరియా అందుబాటులో వుందని చెప్పారు.

పాయకరావుపేట మండలంలో తహశీల్దారు మహేశ్వరరావు, ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు, ఏవో ఆదినారాయణ అన్ని గ్రామ పంచాయతీల్లో యూరియాపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు.

ఎస్.రాయవరం మండలంలోని పలు గ్రామాల్లో తహసీల్దారు జె.రమేశ్‌బాబు, ఎంపీడీవో సత్యనారాయణ, మండల వ్యవసాయాధికారిణి సౌజన్య విడివిడిగా సమావేశాలు నిర్వహించి, యూరియా పంపిణీపై అవగాహన కల్పించారు.

ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


కృష్ణాదేవిపేటలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలోని ఎరువుల దుకాణాల్లో ఎస్‌ఐ వై.తారకేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, వీఆర్‌వో రాజు తనిఖీ చేశారు. ఇంత వరకు ఎంత మంది రైతులకు, ఎంత మొత్తం ఎరువులు విక్రయించారు, ప్రస్తుతం దుకాణాల్లో వున్న ఎరువుల స్టాకు గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ, అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే తమకు ఫిర్యాదు చేయాలని రైతులకు తెలిపారు.

రిమాండ్ ఖైదీల అరెస్టు

... 5వ పేజీ తరువాయి

లభించలేదు. దీంతో మీకు పది సంవత్సరాల శిక్ష తప్పదని, దీనిని నుంచి తప్పించుకోవాలంటే జైలు నుంచి పారిపోవాలని ఏకస్వామి చెప్పాడు. దీంతో పథకం ప్రకారం శుక్రవారం సాయంత్రం హెడ్ వార్డర్ వీర్రాజుపై సుత్తితో దాడి చేసి గాయపరిచారు. ఇతర సిబ్బందిని గార్డు గదిలో బంధించి, జైలు ఏఎస్‌ఐ కృష్ణమూర్తి మొబైల్ ఫోన్‌ను దొంగలించి, గేటు తాళాలను లాక్కొని పరారయ్యారు. రిమాండ్ ఖైదీలు జైలు నుంచి పరారు కావడానికి ఏకస్వామిపై మరో కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు. పరారైన రిమాండ్ ఖైదీలను 24 గంటల్లోనే పట్టుకున్న సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, అనకాపల్లి జిల్లా పోలీసులను ఎస్పీ తుహిన్ సిన్హా ఈ సందర్భంగా అభినందించారు. మీడియా సమావేశంలో అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి, సబ్‌జైలు ఇన్‌చార్జి ఆఫీసర్ డి.రాజు పాల్గొన్నారు.

కూటమి హయాంలో రజకులు అన్ని రంగాల్లో అభివృద్ధి

... 5వ పేజీ తరువాయి

ఆధునికతో కలిపి ముందుకు తీసుకెళ్లానన్నారు. ఈ కార్యక్రమంలో రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణశ్రీనివాస్, పంచకర్ల రమేశ్‌బాబు, ఈశ్వరరావు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన వేట సరదా

... 5వ పేజీ తరువాయి

పెందుర్తి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి సమీపంలోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ (అయ్యప్పకాలనీ)కి చెందిన బల్లంకి శేఖర్ (18), బల్లంకి వాసుతోపాటు చినముషిడివాడ సమీపంలోని ఆక్సిజన్ కాలనీకి చెందిన యేడాడ లక్ష్మణ్ కుమార్ (18) డాక్‌యార్డ్‌లో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరు ఆదివారం ఉదయం 11.30 గంటల సమయంలో చేపలను వేటాడేందుకు మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌కు వెళ్లారు. రాతి రివిట్‌మెంట్‌పై కూర్చుని, నీటిలోకి గేలాలు వేశారు. ఈ క్రమంలో లక్ష్మణ్‌కుమార్ నీటిలో పడిపోయాడు. అతడిని రక్షించేందుకు దూకిన శేఖర్ కూడా మునిగిపోయాడు. అక్కడే వున్న బల్లంకి వాసు భయాందోళన చెంది, సమీపంలో వున్న రిజర్వాయర్ సిబ్బంది వద్దకు వెళ్లి, జరిగిన సంఘటన గురించి చెప్పాడు. వారు వెంటనే పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్, సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సాయంతో రిజర్వాయర్‌లో గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం మూడు గంటల సమయానికి యువకుల మృతదేహాలు లభించాయి.

లింగాపురం.. అభివృద్ధికి దూరం!

- రహదారి ఆద్యంతం గతుకుల మయం
- వర్షం పడితే అస్తవ్యస్తం.. రాకపోకలకు నరకం
- తాగునీటి కొరతతో రోజంతా అవస్థలు
- రేషన్ సరకులకు ఎనిమిది కిలోమీటర్లు వెళ్లాల్సిందే..

నర్సీపట్నం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలోని 20వ వార్డు పరిధిలో లింగాపురం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ఈ గ్రామంలో నివాసం ఉంటున్న గిరిజనులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకునే పాపానికి పోవడం లేదు.

లింగాపురం గ్రామంలో 100 ఇళ్లు ఉన్నాయి. బలిఘట్టం వరహానదికి అవతల వైపు ఉన్న ఈ గ్రామంలో దాదాపు 400కి పైగా జనాభా నివాసం ఉంటున్నారు. వరహానది వంతెన దగ్గర నుంచి గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డు ఆద్యంతం గతుకుల మయంగా మారింది. రుత్తల రాజుబాబు పాకలు దగ్గర నుంచి లింగాపురం అంజేయస్వామి గుడి వరకు రహదారి మరీ దారుణంగా ఉంది. దీంతో చిన్నపాటి వర్షానికి రోడ్డు చిత్తడి చిత్తడవుతోంది. గతుకుల్లో నీరు చేరి చిన్నపాటి చెరువులను తలపిస్తున్నది. దీంతో రాకపోకలకు వాహన చోదకులు, ప్రయాణికులు, గిరిజనులు నరకయాతన అనుభవిస్తున్నారు. ద్విచక్ర వాహన చోదకులు అదుపుతప్పి పడిపోయి గాయపడుతున్నారు. అలాగే గామంలో తాగునీటి సరఫరా కోసం పది వేల లీటర్ల వాటర్ ట్యాంక్ ఉంది. ఉదయం పూట మాత్రమే మోటారు వేసి ట్యాంక్ నింపుతున్నారు. పది వేల లీటర్ల నీరు గ్రామస్థుల అవసరాలకు ఒక పూట మాత్రమే సరిపోతున్నాయి. రెండో పూట నీరు లేక ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రెండో పూట వాటర్ ట్యాంక్ నింపడం లేదని కౌన్సిలర్ మూలపర్తి రామరాజు తెలిపారు. ఈ నీటినే తాగడానికి, వాడకానికి సరిపెట్టుకోవాల్సి వస్తున్నదని, దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.



అడుగడుగునా గతుకులతో ఉన్న లింగాపురం రహదారి



వాటర్ ట్యాంకు వద్ద కుళాయిలు లేకుండా ఉన్న సిమ్మెంటు దిమ్మ

ఇక గ్రామంలో ప్రజలు విద్యుత్ సమస్యలూ ఎదుర్కోక తప్పడం లేదు. త్రీఫేస్ విద్యుత్ లేక పోవడంతో లోవోల్టేజీ సమస్య ఉంటుందని గ్రామస్థులు చెప్పారు. గ్రామంలో 15 విద్యుత్ స్తంభాలు అవసరమని మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లామని, ఇప్పటికీ మంజూరు కాలేదని వాపోయారు. ప్రాథమిక పాఠశాల భవనానికి ప్రహరీ గోడ లేక రక్షణ కరువవుతోంది. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.

రేషన్ సరకులకు ఎనిమిది కిలోమీటర్లు వెళ్లాల్సిందే..

గ్రామంలో 95 మంది రేషన్ లబ్ధిదారులు ఉన్నారు. వారంతా ప్రతి నెలా రేషన్ సరకులు తెచ్చుకోవడానికి బయపురెడ్డిపాలెంలోని చౌక ధరల దుకాణం-21 వద్దకు వెళ్లాల్సి వస్తున్నది. లింగాపురం గ్రామం నుంచి బయపురెడ్డిపాలెం వెళ్లి, రావాలంటే రెండు వైపులా 16 కిలోమీటర్లు దూరం ఉంటుంది. దీంతో ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే బియ్యం ఆటోలో తెచ్చుకోవాలంటే రూ.90 చార్జీలకు ఖర్చు చేయాల్సి వస్తున్నదని గ్రామస్తులు తెలిపారు. పది కేజీలు బియ్యానికైనా తప్పని సరిగా ఆటోలో తెచ్చుకోవాల్సి వస్తున్నది. గ్రామానికి వచ్చి ఇస్తానని చెప్పి డీలర్ రావడం లేదని కౌన్సిలర్ రామరాజు చెప్పారు. స్టాక్ పెట్టుకోవడానికి గది ఇస్తామని చెప్పామని తెలిపారు. గ్రామానికి వచ్చి రేషన్ ఇచ్చే సదుపాయం కల్పించాలని కోరారు అలాగే గ్రామంలో రహదారి, తాగునీరు, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేశారు.

బదిలీలు చేశారు.. నియామకాలు మరిచారు!

ఆస్పత్రిలో ఉన్న ఇద్దరు వైద్యులనూ బదిలీ చేశారు.. కొత్త వారిని వేసినా వచ్చిన వెంటనే వెళ్లిపోయారు.. అంతే! అక్కడి నుంచి నియామకాలనే మరచిపోయారు.. వెరసి రెండున్నర నెలలుగా పూర్తి స్థాయి డాక్టర్లు లేకుండా వైద్యాలయాన్ని కొనసాగిస్తున్నారు.. ఇదీ నాతవరం పీహెచ్‌సీ దుస్థితి.

- నాతవరం పీహెచ్‌సీలో వైద్యుల కొరత
- రెండున్నర నెలల క్రితం ఇద్దరు డాక్టర్లూ బదిలీ
- ఇలా వచ్చి.. అలా వెళ్లిపోయిన కొత్త వైద్యులు
- ఇన్‌చార్జులతోనే నడుస్తున్న ఆరోగ్య కేంద్రం
- సక్రమంగా సేవలు అందక రోగుల అవస్థలు



నాతవరం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో రెండున్నర నెలలుగా వైద్యులు లేరు. జూన్ వరకు ఇక్కడ వైద్యులు రాజేశ్‌నాయుడు, ప్రసన్న పనిచేసేవారు. జూన్‌లో రాజేశ్‌నాయుడు బదిలీపై విశాఖపట్నం కేజీహెచ్‌కు, డాక్టర్ ప్రసన్న నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి వెళ్లిపోయారు. దీంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ధారకొండ పీహెచ్‌సీ నుంచి డాక్టర్ నాగభూషణం, సప్పర్ల పీహెచ్‌సీ నుంచి డాక్టర్ ప్రసన్నకుమార్‌లను ఇక్కడ నియమించారు. వారు బాధ్యతలు చేపట్టిన వెంటనే మరలా ధారకొండ, సప్పర్ల పీహెచ్‌సీలకు వెళ్లిపోయారు. అక్కడ అధికారులు వీరిని రిలీవ్ చేయకపోవడంతో తిరిగి సొంత ఆస్పత్రులకు తిరుగుముఖం పట్టారు. అప్పటి నుంచి నాతవరం ఆరోగ్య కేంద్రానికి కొత్తగా డాక్టర్లను నియమించలేదు.

తాత్కాలికంగా విధుల్లో వైద్యులు

దీంతో జూలైలో మండలంలోని మాధవనగరం, సరుగుడు గ్రామాల్లో జ్వరాలు విజృంభించగా, వైద్య సేవలు అందక సరుగుడులో ఒక్క వ్యక్తి మృతి చెందారు. ఈ వార్త పత్రికల్లో ప్రచురణ కావడంతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి నాతవరం పీహెచ్‌సీలో పని చేయడానికి 15 రోజులకోకసారి గునుపూడి, చిడిగుమ్మల, నర్సీపట్నం తదితర ఆరోగ్య కేంద్రాల వైద్యులను తాత్కాలికంగా పంపిస్తున్నారు. అంతేగాని, పూర్తి స్థాయిలో డాక్టర్లను మాత్రం నియమించడం లేదు. ప్రస్తుతం చీడిగుమ్మలకు చెందిన డాక్టరు రామ్‌గోపాల్ ఒక్కరే నాతవరం ఆరోగ్య కేంద్రంలో ఇన్‌చార్జి డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

మందులూ అంతంతమాత్రమే!

'గోరుచుట్టుపై రోకలి పోటు' అన్న చందంగా నాతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లతో పాటు మందుల కొరత వేధిస్తోంది. ఆస్పత్రిలో నెల రోజులుగా మందుల కొరత తీవ్రంగా ఉంది. డాక్టర్లు లేక సక్రమంగా వైద్య సేవలు అందకపోవడానికి తోడు మందులు అందుబాటులో లేకపోవడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు పడరాని పాట్లు పడుతున్నారు. బీపీ, గ్యాస్ట్రిక్, యాంటీబయాటిక్ తదితర మందులు కూడా లేవని రోగులు చెబుతున్నారు. అయినప్పటికీ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో వారు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాతవరం పీహెచ్‌సీలో పూర్తి స్థాయి వైద్యులను నియమించాలని, మందుల కొరత లేకుండా చూడాలని మండల ప్రజలు, రోగులు కోరుతున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చోడవరంలో సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం/బుచ్చెయ్యపేట/రావికమతం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలోని చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం మండలాల్లో పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. చోడవరంలోని కన్నంపాలెంకు చెందిన కోన చెల్లయ్యమ్మకు మంజూరైన చెక్కును ఎమ్మెల్యే రాజుఏపు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర బొడ్డేడ నాగగంగాధర్, టీడీపీ నేత సకురు కోటేశ్వరరావు, కన్నంపాలెం సర్పంచ్ బర్ల తాతలు, కొట్టాపు చిన్న పాల్గొన్నారు. అలాగే బుచ్చెయ్యపేట మండలంలోని కరక గ్రామానికి చెందిన శెట్టి చిన సత్యారావుకు రూ.83 వేలు, పిల్లా సత్యారావుకు రూ.25 వేలు చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు ఎంవీవీ సత్యనారాయణ, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర డైరెక్టర్ ఎస్.శ్రీరామూర్తి, కోపరేటివ్ అధ్యక్షుడు డొంకిన అప్పలనాయుడు, నాయకులు కోట సత్యనారాయణ, యన్నంశెట్టి శ్రీనివాసరావు, ఆదియ్య, పిల్లా మణికంఠరావు, కొంగ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే రావికమతం మండలంలోని కన్నంపేట గ్రామానికి చెందిన సియాంద్రి నాని కుటుంబానికి మంజూరైన రూ.95 వేల చెక్కును నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు అందించారు. జన సైనికులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా పార్టీ ఆదుకునేందుకు సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా రాజు చెప్పారు.



రావికమతంలో సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న జనసేన ఇన్‌చార్జి రాజు

ఎరువులపై ఆందోళన వద్దు: ఎమ్మెల్యే రాజు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎరువుల గురించి ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు స్పష్టం చేశారు. మండలంలోని గున్నెంపూడిలో ఆదివారం ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల కోసం రైతులు తనకు నేరుగా ఫోన్ చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర డైరెక్టర్ ఎస్.శ్రీరామూర్తి, నాయకులు గూనూరు పెదబాబు, ఎంవీవీ సత్యనారాయణ, రాము, నాయుడు పాల్గొన్నారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులతో అధికారులు గ్రామసభలు నిర్వహించి, ఎరువుల గురించి ఆందోళన చెందవద్దని సూచించారు. ఎంపీడీవో భానోజీరావు, తహశీల్దార్ ఎం.లక్ష్మి, అదనపు ఎస్ఐ భాస్కరరావు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కొత్తూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం రాజుపాలెం జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని రూరల్ పోలీసు స్టేషన్ ఏఎస్ఐ భూలోకరావు ఆదివారం తెలిపారు. ఈ వ్యక్తి ప్యాంటు ధరించి, షర్టు లేకుండా తెల్లని రంగులో ఉన్నాడన్నారు. ఐదున్నర అడుగుల పొడవు, మాసిన గెడ్డం, శరీరంపై పోసయ్య, అమ్మానాన్న అని పచ్చబొట్టు కలిగి ఉన్నాడని వివరించారు. శనివారం అర్ధరాత్రి సమయంలో అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని 108 అంబులెన్సు సహాయంతో వీఆర్వో సురేష్ అనకాపల్లి ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	128.00
లైవ్ ధర	148.00
విత్ స్కిన్	266.00
స్కిన్ లెస్	276.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

కార్మిక వ్యతిరేక విధానాలపై సంఘటిత పోరాటాలు

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు

చోడవరం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై సంఘటితంగా పోరాడాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. చోడవరంలోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్న సీఐటీయూ జిల్లా 13వ మహాసభలు రెండో రోజు ఆదివారం ఆయన ప్రసంగించారు. ప్రభుత్వ విధానాలతో కార్మిక వర్గం మరింత భానిసత్వంలో కూరుకునిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌లు అమలైతే కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిపోతుందని వాపోయారు. ఇప్పటికే పని గంటలు పెంచుతూ కార్మికులపై ప్రభుత్వం పరోక్షంగా ఒత్తిడి చర్యలు ప్రారంభించిందన్నారు. సమష్టి పోరాటాల ద్వారానే కార్మికులకు న్యాయం జరుగుతుందని, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కూడా కార్మికులు ముందుకు రావాలని పేర్కొన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు, ఉద్యోగ భద్రత, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై పోరాటాలు చేపట్టాలన్నారు. ఈ సభలో రాష్ట్ర కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, జిల్లా అధ్యక్షుడు లోకనాథం, కార్యదర్శి ఆర్‌కేఎస్ కుమార్, విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు చెందిన సీఐటీయూ నాయకులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, వీవీ శ్రీనివాసరావు, గూనూరు వరలక్ష్మి, ఎస్‌వీ.నాయుడు, ప్రేమచంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. సభలో 28 తీర్మానాలు ఆమోదించి, వాటి అమలుకు కార్యాచరణ రూపొందించారు.



జిల్లా మహాసభలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

'15 నుంచి ఉపాధ్యాయ సమస్యలపై రణభేరి ప్రచార జాత'

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యల సాధనకు ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు రణభేరి ప్రచార జాత నిర్వహించనున్నట్టు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి తెలిపారు. ఆదివారం ఇక్కడ జరిగిన ఫెడరేషన్ మధ్యంతర కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పీఆర్‌సీ, డీఏ, ఇతర బకాయిల సాధన కోసం ఈ కార్యక్రమాన్ని తలపెట్టామన్నారు. ఉపాధ్యాయులను కేవలం చదువు చెప్పడానికి మాత్రమే వినియోగించుకోవాలని, అస్తవ్యస్తంగా పునర్ వ్యవస్థీకరించిన పాఠశాలల వ్యవస్థను సరిదిద్దాలని, ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ.25వేల కోట్ల ఆర్థిక బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. వీటి సాధనకు చేపట్టనున్న ప్రచార జాత 18న అనకాపల్లిలోకి ప్రవేశిస్తుంద న్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం ముగిసే లోపు ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోతే సెప్టెంబరు 25వ తేదీన విజయవాడలో భారీ రణభేరి బహిరంగసభ నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, పి.వెంకటరావు, యల్లయ్యబాబు, జోగా రాజేష్, రొంగలి ఉమాదేవి, ఎస్ఎస్ నాగమణి, జీకేఆర్ స్వామి, అలివేలు తదితరులు పాల్గొన్నారు.



రణభేరి ప్రచార జాతా బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

సకాలంలో యూరియా: డీఎల్‌డీవో నాగలక్ష్మి

మాడుగుల రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులందరికీ సకాలంలో యూరియా అందిస్తామని నర్సీపట్నం డీఎల్‌డీవో నాగలక్ష్మి తెలిపారు. ఎంపీడీవో కొంకి అప్పారావు, తహశీల్దార్ రమాదేవి, ఎస్ఐ నారాయణరావు బృందాలుగా యూరియా కొరతపై ఆదివారం గ్రామసభలు నిర్వహించారు. ఇందులో భాగంగా డీఎల్‌డీవో నాగలక్ష్మి ఎం.కోటపాడు పీఏసీఎస్ పరిశీలించి రైతులతో మాట్లాడారు. జిల్లాలో 24 మండలాలకు డిమాండ్ మేరకు యూరియా సరఫరా చేస్తామన్నారు. పీఏసీఎస్‌లు, రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ శానాపతి గంగాధర్, క్లస్టర్ ఇన్‌చార్జి మజ్జి లక్ష్మీరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

'యూరియా అవసరమైతే తెలపండి..'

రావికమతం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): యూరియా కావాల్సిన రైతులు సచివాలయంలో తెలిపితే అందిస్తామని ఎంపీడీవో ఎస్.సీతారామస్వామి తెలిపారు. ఆదివారం గొంప, తోటకూరపాలెం, తట్టబంద, మరుపాక గ్రామాల్లో రైతులతో నిర్వహించిన సభల్లో ఆయన మాట్లాడుతూ యూరియా కొరత లేకుండా సరఫరా చేస్తున్నామన్నారు. అయినప్పటికీ విజ్ఞప్తులు అందుతున్నాయని, దీన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని గ్రామాల్లో అధికారుల బృందం పర్యటించి రైతులతో సమావేశాలు నిర్వహించినట్టు చెప్పారు. కార్యక్రమాల్లో తహశీల్దార్ అంబేడ్కర్, వ్యవసాయాధికారి రమేశ్‌బాబు, ఎస్ఐలు రఘువర్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దోమతెరల పంపిణీలో ఫిర్యాదులు రాకూడదు

రావికమతం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దోమతెరల పంపిణీలో ఫిర్యాదులకు రాకూడదని ఎంపీడీవో సీతారామస్వామి స్పష్టం చేశారు. పలు గ్రామాల్లో ఆదివారం దోమతెరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమిర, కవ్వగుట, చీమలపాడు, దిడ్డి గ్రామాల్లో ప్రజలు మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్‌కు గురికాకుండా ముందు జాగ్రత్త చర్యగా ప్రభుత్వం 1,425 దోమతెరలను సరఫరా చేసిందని చెప్పారు. వీటిని కార్యదర్శులు సక్రమంగా పంపిణీ చేయాలని ఆయన సూచించారు.

బ్లాస్టింగ్‌లపై ఫిర్యాదు చేసినా స్పందన శూన్యం



రాజన్నపేటలో నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

రోలుగుంట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజన్నపేట శివారున నిర్వహిస్తున్న క్వారీలో నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్‌లతో ఇళ్లు దెబ్బతింటున్నాయని ఫిర్యాదు చేసినా కనీసం పరిశీలన చేపట్టలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం గ్రామంలో నిరసన చేపట్టారు. క్వారీ యాజమాన్యం నిర్వహించే పరిమితికి మించి బ్లాస్టింగ్‌లు చేయడంతో గ్రామంలో 30 కుటుంబాలకు చెందిన ఇళ్లు బీటలు వారిపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఫ్యాన్లు, టీవీలు కాలిపోయాయన్నారు. సమయపాలన లేని బ్లాస్టింగ్‌ల వల్ల పిల్లల గుండెలు అదిరిపోతున్నాయన్నారు. కాలుష్యం పెరిగిపోయి శ్వాసకోశ వ్యాధుల బారిన పడ్డారన్నారు. దీనిపై ఆర్డీవో సమగ్రమైన విచారణ చేపట్టాలని, లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, జనసేన పంచాయతీ అధ్యక్షుడు బుంగా కోటి హెచ్చరించారు.

మత్స్యకారుల అర్ధనగ్న ప్రదర్శన



చెరువులో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న మత్స్యకారులు

రావికమతం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక మత్స్యకార సొసైటీ ఏర్పాటు చేసి జీవనోపాధికి కల్పించాలని డిమాండ్ చేస్తూ కొత్తకోట గ్రామానికి చెందిన మత్స్యకార సభ్యులు ఆదివారం అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా మత్స్యకార సంఘ సభ్యులు బేరా బాబూరావు, నూకరాజు, ఎం.లక్ష్మణ్, ఇంటి నాగేశ్వరావు మాట్లాడుతూ ఐదేళ్లుగా జీవనోపాధి లేక దయనీయ స్థితిలోకుటుంబాలతో సతమతమవుతున్నామని వాపోయారు. ఉపాధి పొందేందుకు కొత్తకోట పంచాయతీ పరిధిలో చాలా చెరువులు ఉన్నప్పటికీ ప్రత్యేక సొసైటీ ఉంటేనే తప్ప సాధ్యం కాదన్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారులు గుర్తించాలని, తమకు ప్రత్యేక మత్స్యకార సొసైటీ ఏర్పాటు చేసి జీవనోపాధి కల్పించాలని వారు విన్నవించారు.

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు

మాడుగుల, సెపెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు పర్యవేక్షణలో అమ్మవారికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున అమ్మవారిని అలంకరించి కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. స్థానిక, స్థానికేతర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మరికొంత మంది భక్తులు అమ్మవారి ఘటాల పండుగను నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉండగా చంద్ర గ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు అమ్మవారి ఆలయాన్ని మూసివేశారు. సోమవారం ఉదయం 6 గంటలకు ఆలయాన్ని తెరిచి శుద్ధి చేయనున్నట్టు పురోహితుడు శ్రీను తెలిపాడు.

ఘనంగా అచీవర్స్ డే

మాకవరపాలెం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అవంతి కళాశాలలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన అచీవర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో తమ లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ప్రతీ విద్యార్థి తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని కోరారు. ఉన్నదాంతో సంతృప్తి చెంది, ఇంకా ఉన్నత స్థాయికి ఎదగలాన్నారు. చదువు, సాధన, సంపాదనలో ఎప్పటికీ శ్రమను ఆపకూడదన్నారు. అనంతరం 1050 మంది విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూ జీవీ వైస్ చాన్సలర్ డి.రాజ్యలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ సకాలంలో ఎరువులు

చీడికాడ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరి నాట్లు వేసిన రైతులందరికీ సకాలంలో ఎరువులు పంపిణీకి ప్రభుత్వం సిద్ధంగా ఉందని నర్సీపట్నం డీఎల్‌డీవో నాగలక్ష్మి తెలిపారు. చీడికాడలో ఆదివారం రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఎరువుల కోసం ఇబ్బందులు పడనవసరం లేదన్నారు. వ్యవసాయ శాఖ సూచనల మేరకు ఎరువులు వినియోగించాలని చెప్పారు. ఎంపీడీవో వి.రామసుంద్రరావు, పంచాయతీ కార్యదర్శి సన్యాసిరావు, సర్పంచ్ గాలి సామాలమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఎరువులు

గొలుగొండ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని తహశీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని పాతమల్లంపేట, పాకలపాడు, గుండుపాల, కొత్తమల్లంపేట, జోగంపేట, గొలుగొండ, కొత్తఎల్లవరం గ్రామ సచివాలయాల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో ఎరువులతో పాటు యూరియా రైతులకు అందించేందుకు సిద్ధం చేశామన్నారు. ఈ ఖరీఫ్‌కు సరపడా యూరియా ఉందన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయాధికారి సుధారాణి, ఎస్ఐ రామారావు, ఇన్‌చార్జి ఎంపీడీవో బాబూరావు, సర్పంచ్‌లు కొల్లి రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

రైతులతో గ్రామసభలు

దేవరాపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రైతులతో గ్రామసభలు నిర్వహించారు. యూరియా కొరత లేనప్పటికీ కొంత మంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. తహశీల్దార్ లక్ష్మీదేవి, ఎంపీడీవో సువర్ణరాజు, ఎస్ఐ సత్యనారాయణ, వ్యవసాయ అధికారి ఎల్.వై.కాంతమ్మ బృందాలుగా ఈ సభలు నిర్వహించారు. ఇంకా యూరియా అందని రైతుల వివరాలను ఈ సందర్భంగా వారు సేకరించారు.

'జమీలు సేవలు మరవలేనివి'

నాతవరం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అంకంరెడ్డి జమీలు వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాతవరం శ్మశానవాటికలో తుప్పలను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం రాష్ట్ర పామాయిల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పైల పోతురాజు మాట్లాడుతూ జమీలు నియోజకవర్గానికి అందించిన సేవలు మరువలేమని చెప్పారు. నాతవరం అభివృద్ధిలో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.అప్పలనర్స, జి.రాణి, కరక అప్పలరాజు, కె.రేణుక, ఎ.పార్వతి, ఎ.రాంబాబు పాల్గొన్నారు.

పాడేరు, అరకు నియోజకవర్గాల వైసీపీ పరిశీలకుడిగా సత్యారావు



చోడవరం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గోవాడకు చెందిన ఏడువాక సత్యారావును నియమిస్తూ ఆ పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన సత్యారావుకు అరకు, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాల పార్టీ పరిశీలకుడిగా కూడా బాధ్యతలు అప్పగించింది. ఈ పదవులకు నియ మించడం పట్ల పార్టీ అధినేత జగన్‌తో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు అమర్, మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీలకు సత్యారావు కృతజ్ఞతలు తెలిపారు. కాగా సత్యారావును ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు.

మాడుగుల, 'పేట' నియోజకవర్గాల వైసీపీ పరిశీలకుడిగా శ్రీనివాసరావు



పరవాడ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో గల మాడుగుల, పాయకరావుపేట నియోజకవర్గాలకు వైసీపీ అసెంబ్లీ పరిశీలకునిగా పరవాడకు చెందిన పైలా శ్రీనివాసరావును నియమిస్తూ పార్టీ అధిష్ఠానం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈయన వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్నారు. పాయకరావుపేట, మాడుగుల నియోజకవర్గాల్లో పార్టీ తరపున కార్యక్రమాలు చేపడుతూ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆయన వివరించారు.